01ATP15_01ATP15.qxd 15-02-2025 PM 10:48 Page 1





అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 16 ఫిబ్రవరి 2025 పేజీలు : 04

# నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగాలు కల్పించడమే మా కూటమి ప్రభుత్వం లక్ష్యం ..!

- ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

న- మేము పాలకులం కాదు ప్రజలకు సేవకులం




సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి,



టిడిపి కార్యాలయంలో జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగ యువత



నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల

**మడకశిర టౌన్ జనవరి 15 ప్రభాతవార్త**

మడకశిర నియోజకవర్గంలో విద్యార్థులకు విద్య, నిరుద్యోగ యువతి,యువకులకు ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వం లక్ష్మని టీటీడీ బోర్డు మెంబర్,ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి తెలిపారు, శనివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణంలో నియోజకవర్గంలో ఉన్నటువంటి నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా టిటిడి బోర్డు ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు మాట్లాడుతూ :దాదాపు 50 నుంచి 60 కంపెనీ ప్రతినిధులను మడకశిరకు రప్పించడం జరిగిందన్నారు, గత ఐదు సంవత్సరాల్లో పరిశ్రమలు రాక ఈ రాష్ట్రం వెనుకబడి నిరుద్యోగ యువతీ, యువకుల శాతం ఎక్కువ కావడం జరిగిందని ఉద్యోగ అవకాశాలు లేక గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు నిరుద్యోగ యువతీ యువకులకు మాట ఇవ్వడం జరిగింది, దాదాపు లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తామని అందులో భాగంగానే అన్ని నియోజకవర్గాల్లో జాబ్ వేళాలు నిర్వహిస్తున్నారని మడకశిర నియోజకవర్గంలో గతంలో ఇప్పటికే రెండుసార్లు జాబ్ మేళా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు, మా నియోజకవర్గంలో అత్యంత వెనుకబడిన ప్రాంతం కాబట్టి అత్యధికంగా వలసలు వెళ్లినారు కాబట్టి వలసలను అరికట్టేందుకు సీఎం చంద్రబాబు ఆశీస్సులతో ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయబోతున్నామని వారు తెలిపారు, ఇప్పటికే ఆర్,అనంతపురం గ్రామం దగ్గర మందు గుండ్ల ఫ్యాక్టరీ కోసం దాదాపు 1000 ఎకరాలు, 1500 కోట్ల రూపాయలతో అగ్రిమెంట్ కూడా రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందన్నారు , అగలి మండలంలో ఉన్నటువంటి మూడు వేల ఎకరాలు భూములు కూడా పరిశ్రమలు రాబోతున్నాయని తెలిపారు. త్వరలో ఇండియన్ డిజైన్ కు సంబంధించినటు వంటి పరిశ్రమలు మార్చినెల తొలి వారంలోనే మిగతా 4లో...

# నిర్మానుష్యంగా దర్శనమిచ్చిన హాస్టల్



మిట్టపల్లి వసతి గృహంలో విద్యార్థులు దృశ్యం

- రికార్డుల్లోనేమో 116 మంది విద్యార్థులు
- ఉండేవారు ఇంటికెళ్ళారంటూ ఎబిసిడబ్ల్యూఓ వ్యాఖ్య!
- మెనూ ప్రకారం అందని భోజన,వసతులు
- ఇదీ బిసి సంక్షేమ హాస్టళ్ళ పనితీరు...!

**శ్రీసత్యసాయి జిల్లా, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త ప్రతినిధి:**

అది వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ఆశ్రయ మిచ్చి, వారికి విద్యాబుద్ధులు చెప్పి, వారి భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన మహోన్నత ఆశయంతో ఏర్పాటు చేసిన వసతి గృహం. ఈ వసతి గృహం ద్వారా సామాజి కంగా, ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు కడుపు నిండ పౌష్టికాహారాన్ని అందించి, వసతిని కల్పించి, వార్డెన్ మరియు సిబ్బందిని నియమించి వారికి జీత భత్యాలు కల్పిస్తూ విద్యార్థులకు బంగారు భవిష్యత్తు కల్పించాలని మహత్తర మైన బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. అయితే సదరు ప్రభుత్వ ఆశయాన్ని నీరుగారుస్తూ హాస్టల్ సిబ్బంది, సంబంధిత అధికారుల స్వార్థపూరిత కారణాలతో ఒక్క విద్యార్థి లేకుండా సదరు హాస్టల్ ఖాళీగా దర్శన మివ్వడం చూస్తే సదరు అధికారుల చిత్తశుద్ధి ఏమిటో మనకు ఇట్టే అర్థమౌతుంది. వివరాల్లోకి వెళితే పుట్టపర్తి నియోజకవర్గ పరిధిలోని ఓడిసి మండలం గౌనిపల్లి బిసి హాస్టల్ నందు 116 మంది విద్యార్థులు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబు తున్నాయి. శనివారం రాత్రి 8 గంటల సమయంలో ప్రభాతవార్త ప్రతినిధి ఆ హాస్టల్‌ను సందర్శించగా నిర్మాన్యుష్యంగా దోర్లు తెరబడి ఉండి పిల్లల వస్తుసామాగ్రి తదితర వస్తువులు దర్శనమిచ్చాయే తప్ప ఒక్క విద్యార్థి కూడా లేకపోవడం ఆశ్చర్యం కలిగించింది. దీంతో పాటు ఆ హాస్టల్ నందు వంట మనిషి కానీ, వర్కర్ కానీ, వాచ్‌మెన్ కానీ ఎవరూ కూడా కానరాకపోవడం విస్తుగొలిపింది. ఆ సందర్భంలో ప్రత్యక్షంగా హాస్టల్ యొక్క దుస్థితిని జిల్లా బిసివెల్ఫేరిధికారి నిర్మలజ్యోతికి వీడియో కాల్ ద్వారా ప్రత్యక్షంగా వీక్షించి ఆశ్చర్య పోయారు. ఈ డివిజన్ పరిదిలో ఎబిసిడబ్ల్యూఓ అధికారి అయిన బాలాజీని హాస్టల్ దుస్థితిపై చరవాణి ద్వారా సంప్రదించగా, సాయంత్రం 5 మంది పిల్లలు ఉండేవారని, రేపటి రోజు ఆదివారంకావడంతో ఇంటికి వెళ్ళి ఉండవచ్చని, అక్కడ విధులు నిర్వహిస్తున్న వార్డెన్‌ను అడిగి సమాధానం చెబుతానన్నారు. హాస్టల్ వార్డెన్ సరస్వతికి ఫోన్ చేయగా, పని చేయలేదు.



గౌనిపల్లిలో నిర్మాన్యుష్యంగా దర్శనమిస్తున్న వసతిగృహం దృశ్యం

అంతకుమునుపు ఓడిసి మండలంలోని మిట్టపల్లి హాస్టల్‌ను సందర్శించగా అక్కడ హాస్టల్ వార్డెన్ లేకపోగా, 90 మంది ఉండాల్సిన హాస్టల్‌లో కేవలం 35 మంది విద్యార్థులు మాత్రమే కనిపించారు. అక్కడ కాయగూరలు, వస్తుసామాగ్రతి పరిశీలించినప్పుడు అవి కుళ్ళిపోయి ఉండడం, నాసిరకంగా ఉండడం కనిపించింది. మెనూ ప్రకారం శనివారం రోజున అన్నం, దొండ కాయకూర, పాలకూర పప్పు, మజ్జిగ, అరటి పండు అందించాల్సి ఉండగా, తమకు ఇవేమీ పట్టనట్లు అన్నం, నాసిరకం పప్పుతో, నీళ్ళమజ్జిగతో సరిపెట్టగా, ఉన్న 35 మంది విద్యార్థులకు గాను అరకొరగా 20 అరటిపళ్ళు మాత్రమే అక్కడ కనిపించాయి. హాస్టల్ వార్డెన్‌ను గురించి విచారించినప్పుడు ఓడిసి బిసి హాస్టల్ నందు ఉన్నాడని, అక్కడ వంటమనిషి చెప్పడం జరిగింది. వెంటనే ఓడిసి బిసి హాస్టల్‌ను సందర్శించగా అక్కడ పరిశుభ్రమైన వాతావరణం కనిపించకపోగా, అన్ని రికార్డులను హాస్టల్ వార్డెన్ కార్యాలయం నందు ఉంచి హాజరు పట్టిక మాత్రమే భద్రంగా బీరువాలో దాచుకున్నారు. దీన్ని బట్టి చూస్తే వారు హాస్టళ్ళలో బయో మెట్రిక్ లేకపోవడంతో తమ ఇష్టాను సారం మ్యాన్యువల్ హాజరు వేసుకుంటూ బిల్లుల ద్వారా అక్రమార్జనకు పాల్పడుతున్నారన్న విషయం తేటతెల్లమౌతోంది. ఈ హాస్టల్‌కు ఇన్‌చార్జ్‌గా ఉంటున్న హాస్టల్ వార్డెన్ రవీంద్రనాథ్ రెడ్డి ఓడిసి బిసి హాస్టల్‌లో సైతం ఆ సమయంలో లేకపోవడం ఆయన అలసత్వానికి నిదర్శనం. ఇతను సర్వసాధారణంగా కదిరికే పరిమిత మౌతూ వంటమనుషుల చేతనే హాస్టల్ నిర్వహణ సాగిస్తుంటాడన్న విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం పది పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం కారణంగా 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు సైతం జ్ఞానార్జనలో తమ విలువైన సమయాన్ని కోల్పోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం హాస్టళ్ళలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెబుతున్నప్పటికీ, వాటిని కొంత మంది వార్డెన్లు తమ స్వార్థ ప్రయోజనాల కోసం విద్యార్థులకు సమకూర్చక అక్రమ బిల్లులు చేసుకుంటూ ధనార్జన గావిస్తున్నారన్న విమర్శలు సర్వత్ర వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపిస్తే మరిన్ని అక్రమాలు వెలుగు చూసే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడే అధికారులపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని, విద్యార్థులకు నాణ్యమైన వసతి సదుపాయాలను కల్పించడంతో పాటు ఉత్తమ విద్యాబుద్ధులు అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

# గోదావరి జన్మస్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త బ్యూరో**



మహారాష్ట్రలోని నాసిక్ సమీపంలోని గోదావరి జన్మస్థలాన్ని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సందర్శించారు. ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన త్రయంబకేశ్వర క్షేత్రం పర్యటనలో భాగంగా ఆమె బ్రహ్మగిరి పర్వత ప్రాంతాన్ని శనివారం సందర్శించారు. దక్కన్ పీఠభూమి వెంబడి రైతులకు జీవనాధారంగా పరిగణించబడే గోదావరి నది జన్మస్థలంగా కూడా ఈ ప్రదేశం ప్రసిద్ధి చెందింది. బ్రహ్మగిరి పర్వత ప్రాంతాలకు రోడ్డు మార్గంలో వెళ్లారు. అనంతరం అక్కడి నుంచి ట్రెక్కింగ్ ద్వారా గోదావరి నది జన్మస్థలానికి వెళ్లారు. కొండపైకి వెళ్ళే మార్గంలో ఉన్న దేవాలయాలను సందర్శించారు. కొండపై ప్రసిద్ధ బ్రహ్మగిరి ఆలయం ఈ ప్రదేశంలో ఉంది. త్రిసంధ్యా గాయత్రి, గణేశుడి జన్మస్థలం, గోరఖ్నాథ్ మరియు ఇతరులతో కూడిన నాథ సమ్రాదయ మొదటి నాథుడి ప్రదేశాల్ని ఆమె సందర్శించారు. అక్కడి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.



గోదావరి నది పుట్టిన ప్రాంతాన్ని, ఆ ప్రాంతంలోని ఆలయాలను సందర్శించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

అత్యంత పవిత్రమైన గోదావరి జన్మస్థలాన్ని సందర్శించడం తన పూర్వజన్మసుకృతమని పరిటాల సునీత అన్నారు. ఈ ప్రాంతంలో పర్యటిస్తుంటే ఒక ప్రత్యేక అనుభూతి కల్గిందన్నారు. ఆదివారం రోజు త్రయంబకేశ్వరున్ని దర్శించుకోనున్నట్టు చెప్పారు. ఈ ప్రాంతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి నాయకుడు ఉండి ఉంటే ఎంతో అభివృద్ధి చేసి ఉండేవారన్నారు. ఎంతో మహిమాన్విత క్షేత్రంగా ఉన్నప్పటికీ భక్తులకు తగిన సౌకర్యాలు లేవని ఆమె అభిప్రాయపడ్డారు.

# స్వచ్ఛతను పెంపొందించటమే 'స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్' లక్ష్యం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ - వంకరాజుకాల్వలో సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ తనిఖీ



'స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్' ర్యాలీ చేస్తున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్



అంగన్‌వాడి చిన్నారులతో ముచ్చటిస్తున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

**పామిడి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

సంపూర్ణ స్వచ్ఛ గ్రామాలను ప్రోత్సహించి స్వచ్ఛతను పెంపొందించటమే 'స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛదివాస్' లక్ష్యం అని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిదిలోని వంకరాజుకాల్వలో శనివారం మధ్యాహ్నం పర్యటించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్, సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఆయుస్మాన్ భారత్ హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను పరిశీలించి అక్కడ మొక్కను నాటారు. 'స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో బాగంగా అధికారులతో కలిసి చెత్తను తొలగించి అక్కడి నుండి శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయం వరకూ ర్యాలీ నిర్వహించి అంగన్‌వాడి చిన్నారులతో కొద్దిసేపు ముచ్చటించారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యత, ఆరు బయట చెత్త వేయరాదని నినాదాలు చేస్తూ ప్రతిజ్ఞ చేయించిన ఆయన తడి పొడి చెత్తను వేరుచేసే విధానాన్ని ప్రత్యక్షంగా ప్రజలకు అవగాహణ కల్పించారు. ఇక్కడి సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ చాలా బాగుందని కితాబు ఇచ్చారు. పరిశుభ్రత అనేది చాలా ముఖ్యం అని దేవాలయాలు, చర్చీలు, మసీదులోన్ల చెత్త ఉండదని ఆయాప్రదేశాలు ఎంత పరిశుభ్రంగా ఉంటాయో మని గృహాలు, రోడ్లు, ధుఖానాలు, కార్యాలయాలు అంతే పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్‌లో చెత్తను సంపదగా మార్చేందుకు ప్రభుత్వం క్లాత్ మిత్రులను ఏర్పాటు చేసిందని అక్కడ ఎరువులను తయారు చేసి పొలాల్లో వేసుకోవచ్చని తెలిపారు. ఉపాధిహామి పథకం కింద ఇంకుడు గుంత, సామూహిత ఇంకుడు గుంతలను కూడా ఏర్పాటు చేసుకోవచ్చని గ్రామంలో చెత్త వృధా కాకుండా సంపద తయారు చేసేలా మహిళల బాగస్వామ్యం అత్యంత ముఖ్యమైనదని తెలియజేస్తూ మహిళలు చిత్తశుద్ధితో బాగస్వామ్యం కావాలన్నారు. అనంతరం క్లాత్ మిత్రులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సన్మానించారు. అనంతరం గ్రామంలోని ఉపాధిహామి పథకం కింద వన్నూర్‌బీ లబ్దిదారుని ఇంటి వద్ద ఇంకుడు గుంతకు భూమిపూజ చేసి త్వరతగతినా పూర్తి చేయాలని అధికారులను తెలియజేశారు. వెబ్‌ల్యాండ్ సవరణపై ధర్మవరానికి చెందిన సాయికిరణ్ వంకరాజుకాల్వ వద్దనున్న 1.95 సెంట్ల పొలానికి చేరుకున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ధరఖాస్తు విషయమై క్షేత్రస్థాయిలో పరిశీలించి మూడు రోజుల్లోను ధరఖాస్తుదారిడి వెబ్‌ల్యాండ్ సవరణపై తగిన చర్యలు తీసుకుని పరిష్కరించాలని ఆర్డీఓను ఆదేశించారు. ఈకార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్, డ్వామా పిడి సలీమ్‌బాషా, డిపిఓ నాగరాజునాయుడు, జిల్లా పరిషత్ సీఈఓ రామచంద్రారెడ్డి, డిఎల్‌డిఓ విజయలక్ష్మి, తహాశీల్దార్ శ్రీధరమూర్తి, ఎంపిడిఓ తేజోష్ణ, సర్పంచు లక్ష్మిదేవి, ఎంపిటిసి సభ్యురాలు సువర్ణ, కార్యదర్శులు షామీర్, శివమూర్తి, ఏపిఓ మల్లేశ్వరీ, ఏఎన్ఎం ధమయంతి, ఆయాశాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాలకు మేలు చేసేలా కేంద్ర బడ్జెట్

- కూటమిలో విభేదాలు లేవు - రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్

**అనంతపురం సిటి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

దేశంలో అన్ని వర్గాలకు మేలు చేసేలా కేంద్ర బడ్జెట్ ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. నగరంలోని ఆర్ అండ్ బి అతిధి గృహంలో విలేకరుల సమావేశంలో అనంతరం నగరంలోని ఒక ప్రవేట్ హోటల్ లో వ్యాపార వర్గాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ సముతుల్యంగా ఉందని,రాష్ట్రాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూనే మౌలిక సదుపాయం,వ్యవసాయం,వైద్య ,విద్య, టెక్నాలజీ రంగాల్లో నూతన మార్పులు తెచ్చేలా కేంద్రం ప్రణాళికను రచించిందన్నారు.అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ. 2.5లక్షల కంటే మించిన ఆదాయంపై పన్ను వసూలు చేసేదని, కానీ మోదీ ప్రభుత్వం ఆ మొత్తాన్ని ఐదురెట్లు పెంచి రూ. 12 లక్షలు చేసి మధ్యతరగతి కుటుంబాలకు ఊరట కలిగించిందన్నారు.అదే విధంగా వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారని,ఉపాధి హామీ పథకంలో పనిదినాలు పెంచి కూలీలకు ఉపాధి పెంచమని,ప్రజల తలసరి ఆదాయం పెంచే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తోందన్నారు.విద్యా రంగంలో పెనుమార్పులకు శ్రీకారం చుట్టి యువతకు ఉపాధి,ఉద్యోగ అవకాశాలు పెంపొందించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. దేశంలో వైద్య విద్యకు పెద్దపీట వేస్తూ 75 వేల మెడికల్ సీట్లు ఐదేళ్లలో పెంచే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు.రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని,వైద్యులు సమయ పాలన పాటించాలని ఆదేశించామన్నారు.రాష్ట్రంలో కింది స్థాయిలో స్థానిక నేతల మధ్య కొన్నిచోట్ల విభేదాలు ఉండవచ్చని,రాష్ట్ర ముఖ్య నేతల మధ్య ఎటువంటి విభేదాలు లేవని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేశ్, ప్రధాన కార్యదర్శి కార్యదర్శి అశోక్ రెడ్డి,సీనియర్ నేతలు సంధి రెడ్డి శ్రీనివాసులు,చిరంజీవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

# రాబోవు రోజుల్లో ప్రభుత్వ ఆరోగ్య వైద్యశాల రూపురేఖలు మారుస్తాం



ప్రభుత్వ వైద్యశాలను పరిశీలిస్తున్న ఎంపీ బీకే పార్థసారథి బెల్ కంపెనీ ప్రతినిధులు

**రొద్దం. ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

శనివారం హిందూపురం పార్లమెంటు సభ్యుడు బి.కె పార్థసారథి బెల్ కంపెనీ ప్రతినిధులు మండల కేంద్రమైన రొద్దం ప్రభుత్వ వైద్యశాలలోని శిథిలావస్థలో ఉన్న గదులను పరిశీలించి సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపీ బి కే పార్థసారథి బెల్ కంపెనీ ప్రతినిధులు డాక్టర్ సోమశేఖర్ వైద్య సిబ్బంది తెదేపా నాయకులతో సమీక్ష నిర్వహించి అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టి దాదాపు 60 సంవత్సరాల కాలం అయిందని ప్రస్తుతం గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని అంతేకాకుండా మండల ప్రజలకు అవసరమయ్యే పరికరాలు లేకపోవడంతో చాలా ఇబ్బందికి గురి కావాల్సి వస్తుందని అందుచేతనే ఈరోజు మండల ప్రభుత్వ కేంద్రాన్ని పరిశీలించడం జరిగిందని రాబోవు రోజుల్లో బెల్ కంపెనీ ప్రతినిధుల సహకారంతో యూరిన్ దయాబెటిస్ బ్లడ్ ప్రెజర్ టెస్టులతో పాటు ఇంకా ఏవైతే ప్రజలకు కావలసిన ఎక్విప్మెంట్ టెక్నికల్ పరికరాలను అందుబాటులోకి తీసుకొని వచ్చే విధంగా రూపకల్పన చేస్తామని తెలియజేశాడు అత్యవసర చికిత్సల కోసం హిందూపురం అనంతపురం బెంగళూరు ప్రాంతాలకు వెళ్ళవలసి వస్తుందని పోస్టుమార్టం నిమిత్తం ఒక గదిని కాన్పులకు సంబంధించి గదులను ఇంకా ఏవైతే ప్రజల రోగుల అవసరాల నిమిత్తం అందుబాటులోకి తెస్తామని తెలియజేశాడు రాబోవు రోజుల్లో ప్రభుత్వ ఆరోగ్య కేంన్ద్ర రూపురేఖలు మారుస్తామని తెలియజేశాడు ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సోమశేఖర్ బెల్ కంపెనీ ప్రతినిధులు శశి భూషణ్ అశోక్ కుమార్ రవి తెదేపా నాయకులు శుభ రత్నమ్మ రొద్దం నరసింహులు మురళి ఇమామ్ వెంకీ భూపాల్ మున్నా ఉగ్గిరప్ప పవన్ తెదేపా కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న బి.కె పార్థసారథి

### గత ప్రభుత్వంలో అదానితో చేసుకున్న

# భూ కేటాయింపులు రద్దు చేసుకోండి

- ఎమ్మెల్యేల పనితీరుపై దృష్టి పెట్టండి - క్షేత్రస్థాయిలో పరిస్థితులను సరి చేయండి - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

**అనంతపురం, ఫిబ్రవరి 15, (ప్రభాతవార్త బ్యూరో)**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పారిశ్రామికవేత్త గౌతమ్ అదానితో చేసుకున్న భూ కేటాయింపుల ఒప్పందం, సోలార్ విద్యుత్ సరఫరా అగ్రిమెంట్లు రద్దు చేసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కె. రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేల పనితీరు పై దృష్టి పెట్టాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను సరిచేయాలని ఆయన సీఎంకు విజ్ఞప్తి చేశారు.శనివారం అనంతపురం సిపిఐ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోడీ రాష్ట్రంలో నాటి సీఎం జగన్ను బురిడీ కొట్టించి రూ.1750 కోట్ల లంచమిచ్చి 2వేల ఎకరాల భూములను అప్పనంగా కొట్టేసిన గౌతమ్ ఆదానిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు . గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు , నేటి ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సదరు గౌతమ్ అదానిపై కేసు పెట్టి విచారణ చేయాలని డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 25 ఏళ్లపాటు రూ.1.10 లక్షల కోట్ల విద్యుత్ ఛార్జీలు వినియోగదారులపై అదనపు భారాన్ని మోపడానికి చేసుకున్న అగ్రిమెంట్ రద్దు చేసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ కి సరఫరా చేసే విద్యుత్ కోసం రాజస్థాన్లో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే అక్కడివారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తారే కానీ, ఆంధ్రప్రదేశ్లో నిరుద్యోగ ఉపాధి సంగతి ఏమిటని ప్రశ్నించారు. ఆదానితో జరిగిన అగ్రిమెంట్లు, కేటాయింపులు రద్దు చేస్తే ఇక్కడ ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు పనితీరుపై చంద్రబాబు దృష్టి సారించాలని తాను ఒక్కడే కష్టపడితే రాష్ట్రం, ఇక్కడి ప్రజలు బాగుపడరని క్షేత్రస్థాయిలో జరుగుతున్న తతంగాన్ని సరి చేసుకోవాలని సూచించారు. కమ్యూనిస్టులుగా తాము సలహాలు ఇస్తున్నామని వాటిని పాటించకపోతే చంద్రబాబు ప్రభుత్వానికే చెడ్డ పేరు వస్తుందని గుర్తు చేశారు.కేంద్రం ప్రస్తుతం ప్రవేశ పెట్టిన బడ్జెట్ రైతాంగానికి, సాదారణ ప్రజలకు ఒరిగేదేమీ లేదని మధ్య తరగతి ఉద్యోగులకు మాత్రము కొంతమేరకు ఉపశమనం ఉన్నప్పటికీ రైతులు పండించిన పంటలకు గిట్టుబాట ధర కల్పించడంపై తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. కార్మికులు, ఉపాధి హామీ కూలీల రేట్లు పెంచాలని, దేశ సాధారణ ప్రజలకు నష్టము కలిగించే విధంగా ప్రవేశ పెట్టిన బడ్జెట్ కు వ్యతిరేకంగా ఈ నెల 14 నుండి 20 వరకు ఐదు వామపక్ష పార్టీలు నిరసన వ్యక్తం చేసే కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా రాయలసీమ వెనకబడిన ప్రాంతానికి సాగునీరు కోసం హంద్రీనీవా ప్రాజెక్టు ఎత్తి పోతుల పథకం ద్వారా కావాల్సిన సాగు నీటిని అందించ లేదని కాల్వ సామర్థ్యము పది వేల క్యూసెక్కులకు పెంచాలని రైతాంగం దీర్ఘ కాలంగా చేస్తున్న పోరాటం తెలిసిందే ప్రభుత్వం కాల్వ సామర్థ్యము పెంచకుండా లైనింగ్ పనులు చేపట్టడం ద్వారా అత్యంత కరవుతో వున్న రాయలసీమ కు అన్యాయము జరుగుతుందని రామకృష్ణ పేర్కొన్నారు. హంద్రీనీవా సాగునీటి కాల్వలు పది వేల క్యూసెక్కులకు సామర్థ్యముకు సరిపడే విధంగా నిర్మాణాలు చేపట్టే వరకు సిపిఐ రైతాంగ పోరాటం చేస్తుందని అందుకు అయ్యే ఖర్చు సుమారు రూ ఆరువేల కోట్లను ఖచ్చితంగా కేటాయించి పనులు చేయాలని రామకృష్ణ ముఖ్యమంత్రి మిగతా 4లో...



విలేకరుల సమావేశం లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

02ATP27_02ATP27.qxd 15-02-2025 PM 10:46 Page 1



## కమ్యూనిటి ఇంకుడు గుంతకు శ్రీకారం.

డి.హీరేహాళ్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:



ఇంకుడు గుంతలను ప్రారంభిస్తున్న డిఎల్‌డిఓ, ఎంపిడిఓ

వీధుల్లో వృధాగా వెళ్తున్న వృధా నీటిని భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలు పెంపొందించే కార్యక్రమంలో భాగంగా డిఎల్‌డిఓ నాగేశ్వర రావు ఇంకుడు గుంతకు శ్రీకారం చుట్టారు. శనివారం డి.హీరేహాళ్ మండలంలోని హులికల్లు గ్రామంలో ఎంపిడిఓ దాస్‌నాయక్, ఈఓఆర్‌డి యోగానంద, ఉపాధి హామీ పథకం ఎపిఓ ఓబన్న, తెదేపా నాయకుడు తిప్పేస్వామిలతో కలిసి కమ్యూనిటి ఇంకుడుగుంతకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎల్‌డిఓ మాట్లాడుతూ భూగర్భ జలాలు మెరుగు పరచడంలో భాగంగా గ్రామ వీధుల్లో వృధాగా పోయే నీటిని భూమిలోనికి పంపడానికి ఉపాధి హామీ పథకం నిధులు రూ.40వేలతో ఇంకుడు గుంత చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా మండల పరిధిలో అవసరమున్న చోట గుర్తించి మరిన్ని ఇలాంటి ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిపి నరసన్న, ఎఫ్ఏ నాగరాజు, పరమేశ్వరప్ప, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎస్‌విజిఎంలో లో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ స్వర్ణాంధ్ర

కళ్యాణదుర్గం టౌన్, ఫిబ్రవరి 15 ప్రభావార్త:



స్వచ్ఛఆంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు యాజమాన్యం

ఎ న్ వి జి ఎ ం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కళ్యాణదుర్గంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ స్వర్ణాంధ్ర కార్యక్రమం నె ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు కలిసి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేసి, అనంతరం ర్యాలీగా తరలి వెళ్లి, మారవహారం నిర్వహించి, తదనంతరం కళాశాల ఆవరణలో చెత్తను సేకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా 3వ శనివారం మన పరిసరాలను పరిశుభ్రం చేసి, స్వచ్ఛ ఆంధ్రను చేస్తూ, స్వర్ణాంధ్రాను నిర్మిద్దాం అని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో కళాశాలప్రిన్సిపాల్ డాక్టర్ జి. జయరామరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శేసయ్య, ఎన్ఎస్ఎస్ పిఓలు డాక్టర్ కె.శ్రీధర్, రవిశంకర్, అధ్యాపకులు శైలజ, జోష్న, ప్రభావతి, శ్యామ్, రాధాకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## పారిశుద్ధం పై అవగాహన..



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పొరాళ్ల ధనార్జున.

రాయదుర్గం రూరల్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 28,29వ వార్డు నందు సచివాలయ సిబ్బంది మరియు 29వ వార్డు కౌన్సిలర్ జ్యోతి, 28వ వార్డు మాజీ కౌన్సిలర్, వార్డు ఇన్‌చార్జ్ పొరాళ్ళ ధనార్జున ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఒక్కొక్కరికి మంజూరైన మూడు చెత్తబుట్టలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందించిన మూడు చెత్తబుట్టలలో ఒకదానిలలో తడి చెత్త, మరొక్కదానిలో పొడిచెత్త, ఇంకొక దానిలలో గ్లాసులు, విషపదార్థం ఉన్న వాటిని వేరువేరుగా చేయాలన్నారు. తమవార్డుకు వచ్చిన పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. రోడ్డుపై కానీ, కాలువలలలో కానీ మురికి వేయరాదని, తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే ఆరోగ్యంను కాపాడుకుంటామని తెలియజేశారు. ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకొని తమ ఆరోగ్యంను కాపాడుకోవవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, బిఎల్ఏలు రవి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మైలార లింగేశ్వర విగ్రహాలకు గంగిపూజ మహోత్సవం

రాయదుర్గం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:



విగ్రహాలను గంగపూజకు తరలిస్తున్న దృశ్యం

పట్టణంలోని 22వ వార్డులో ఉన్న అంబేద్కర్ నగర్ 1క్రాస్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న మైలార లింగేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో భాగంగా శనివారం స్వామివారి విగ్రహాలను గంగిపూజకు తరలించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద నుండి పట్టణంలో తేరుబజార్ మీదుగా బళ్ళారి రోడ్డు, వినాయకసర్కిల్ తదితర ప్రాంతాలతో గొర్రవయ్యలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పాలబావి వద్ద విగ్రహాలకు గంగిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి పెద్దలు గిడ్డ సిద్దప్ప, ఉల్లిగడ్డ పెద్దవన్నూరప్ప, మండి సిద్దప్ప తదితరులు మాట్లాడుతూ నేడు ఆదివారం జరిగే నూతన విగ్రహ ఆవిష్కరణలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

## ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కేశవులు

హిందూపురం ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

చిన్నపిల్లల ఆరోగ్యం పై పెద్దలు ప్రత్యేక దృష్టి సారించాలని చిన్నపిల్లల వైద్యుడు కేశవులు అన్నారు శనివారం హిందూపురం పట్టణంలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల నందు చిన్నపిల్లల వైద్యుల సమైఖ్య ఆధ్వర్యంలో సంకల్ప సంపూర్ణ స్వాస్థ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ కేశవులు మాట్లాడుతూ మంచి ఆహారంతోనే ఆరోగ్యం లభిస్తుందని విద్యార్థులకు సూచించారు.

## స్వచ్ఛ హిందూపురంగా తీర్చిదిద్దుదాం

### - మున్సిపల్ చైర్మన్ డి,ఇ రమేష్

హిందూపురం టౌన్ ఫిబ్రవరి 15 ప్రభాతవార్త



స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, నాయకులు

హిందూపురం పట్టణాన్ని స్వచ్ఛ హిందూపురం గా తీర్చిదిద్దామని దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని హిందూపురం మున్సిపల్ చైర్మన్ డిఇ రమేష్ అన్నారు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో మున్సిపల్ చైర్మన్ పర్యటించారు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డ్ కు తరలించడం జరుగుతుందని అన్నారు ప్లాస్టిక్ కవర్లు కాలువలో వేయడం వలన డ్రైనేజీలలో నీరు బయటికి వచ్చి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని కోరారు ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు వడ్డే అంజనప్ప, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గోమాతకు పూజలు



గోమాతకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

హిందూపురం ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

సద్గురు శ్రీ యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం హిందూపురం రూరల్ మండలం కిరికెర బసవనపల్లి గ్రామంలో గోమాతకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు, అదేవిధంగా శ్రీ క్షేత్రం కైవారం తాతకు అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో సద్గురు శ్రీ ఆదినారాయణ సేవా సమితి అధ్యక్షుడు రవిశంకర్, రామిరెడ్డి, నారాయణప్ప, బసప్ప, గంగాధరప్ప, అశ్వర్థప్ప, లక్ష్మీదేవి ఆదిలక్ష్మి గ్రామస్తులు పాల్గొన్నారు

## బియస్‌యఫ్ జవాన్ ట్రైన్‌ఆక్సిడెంట్‌లో మృతి



బిఎస్‌ఎఫ్ జవాన్ లక్ష్మణ్ ఫైల్ ఫోటో

బ్రహ్మసముద్రం.ఫిబ్రవరి.15. ప్రభాతవార్త

మండల కేంద్రంలోని వడ్డే లక్ష్మన్న33. డిల్లీ రైల్వే స్టేషన్ నందు ట్రైన్ ఆక్సిడెంట్ లో మృతి చెందా డు. వివరాల్లోకి వెళ్ళితే గత వారం రోజుల కిందట స్వగ్రామం బ్రహ్మ సముద్రము వచ్చి కుటుంబ సభ్యుల తో అనందాగా గడిపి తిరుగు ప్రయా నం లో.బార్యా పిల్లలతోకాశ్మీర్ వెళుతూ డిల్లి రైల్వే స్టేషన్ నందు బార్య.మెడలోని.బంగారు గొలుసుదొంగ లక్కో ల్ల గా.దొంగకోసం రైలునుంది దూకె ప్రయత్నంలోప్రక్కన ప ట్టాలపై లక్ష్మన్నపడగా అదేపట్టా పై వస్తున్న మరో రైలు ఢీకొనడంతో జవన్ లక్ష్మన్న అక్కడికక్కడే మరణించాడు.

## తుముకుంటలో అవగాహన ర్యాలీ

హిందూపురం టౌన్ ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం హిందూపురం రూరల్ తూముకుంట పంచాయతీలో అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి కేంచరాయప్ప తెలిపారు ఈ సందర్భంగా సర్పంచ్ రత్నమ్మ పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం తీసుకువచ్చిందని గ్రామాల్లోని ప్రజలు పరిశుభ్రతకు సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో అనురాధ అధికారులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## దామోదరం సంజీవయ్య జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలి

కంబదూరు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త



ఎస్సీ ఎస్టీ జేఏసీ మండలాధ్యక్షుడు డాబా రమేష్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జీవిత చరిత్రను ఏపీ ప్రభుత్వం విద్యార్థుల పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలని ఎస్సీ ఎస్టీ జేఏసీ దళిత గిరిజన సంఘాల కంబదూరు మండల అధ్యక్షుడు డాబా రమేష్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరతు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య104 జయంతోత్సవా ల్లో భాగంగా ఆయన స్మరించుకున్నారు.నేటి తరానికి దామోదరం సంజీవయ్య జీవిత చరిత్ర గూర్చి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. దేశంలోని తొలి దళిత ముఖ్యమంత్రిగా పదవి చేపట్టి పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన గొప్ప నాయకుడు దామోదరం సంజీవయ్య అని అన్నారు. పెన్షన్, ఏసీబీ వంటి వ్యవస్థలు తీసుకొచ్చి పాలనలో కూడా తనదైన ముద్ర వేసి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని పేర్కొన్నారు.

## మండల కేంద్రము నందు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్



స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

మండల కేంద్రం లోని మండల పరి షత్ కార్యాలయం నందు రాష్ట్ర ప్రభు త్వం ఆదేశాల మేరకు "స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర "కార్య క్రమం ఎంపి డి ఓ.ఆధ్వర్యంలో నిర్వహించబడింది ఇందులో భాగంగా మండల పరిషత్ కార్యాలయము నందు మరియు పరిసరాలను శుభ్రపరచడం జరిగినది.అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞచేయడం జరిగినది.అనంతరం తడిచెత్త పొడి చెత్త హానికరమైన చెత్త పై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి, ఉపాధి హామీ సిబ్బంది మరియు గ్రామ పంచాయితీ సిబ్బందికి పాల్గొనడం జరిగినది.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నంద కిషోర్.మరియు కార్యాల యం సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి పోటీలలో బహుమతి పొందిన కణేకల్లు మోకా అఫ్రీన్

కణేకల్లు, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:



ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న అధికారులు

కణేకల్లు మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల నందు చదువుతున్న విద్యార్థిని మోకా అఫ్రీన్ అనే విద్యార్థిని అనంతపురం జిల్లాలో శనివారం జరిగిన అనంతపురం జిల్లా స్థాయిలో నిర్వహించిన రోడ్డు భద్రతా అనే అంశం కాంపిటీషన్లోన రైటింగ్ ప్రోగ్రామ్ పోటీలో పాల్గొన్న కణేకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు మొదటి సంవత్సరం ఎంపీసీకి చెందిన మోకా ఆఫ్రిన్ నీ విద్యార్థికి తృతీయ బహుమతిని కలెక్టర్ మరియు జిల్లా అధికారుల చేత అవార్డు మరియు సర్టిఫికేట్ను అందుకోవడం జరిగినది. ఈ అవార్డు అందుకున్న సందర్భంలో కణేకల్లు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ ఆంజినేయులు ఈ అవార్డును అందుకున్న సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు. ఈ గౌరవం మన కణేకల్లు ప్రభుత్వం జూనియర్ కళాశాలకు చెందినదని తెలిపారు. మోకా ఆఫ్రిన్ ను విద్యార్థినిని కళాశాల అధ్యాపకు బృందం వారు మరియు తోటి విద్యార్థులు అందరు కలిసి అభినందించారు.

## ఐటిఐ కళాశాల ఏర్పాటు చేయండి

డి.హిరేహాళ్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:

డి.హిరేహాళ్ మండలం కేంద్రంలో ఐటిఐ కళాశాల ఏర్పాటు చేసి మండల పరిధిలో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను ఆదుకోవాలని స్థానిక చిరు వ్యాపారి షబ్బీర్ తహసీల్దార్ మునివేలుకు వినతిపత్రం అందజేశారు. శనివారం ఆయన మండల కేంద్రంలోఎని రెవెన్యూ కార్యాలయం చేరుకొని తహసీల్దార్ కు వినతిపత్రం అందించి గత 2018లో డి.హిరేహాళ్ మండల కేంద్రంకు ఐటిఐ కళాశాల మంజూరైనట్లు దినపత్రికలో వార్త ప్రచురితమైందని అప్పటి తెదేపా ప్రభుత్వం మారి వైకాప ప్రభుత్వం రావడంతో ఐటిఐ కళాశాల మంజూరు విషయం కాస్త మరుగున పడిందని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయం రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా మంజూరుకు సంబంధించిన ఫైలు రెవెన్యూ కార్యాలయంలో ఉంటుందని ఈ విషయం తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించినట్లు ఆయన వినతి పత్రంలో పేర్కొన్నారు. డి.హిరేహాళ్ మండలంలో ఇనుము ఉక్కు పరిశ్రమలు ఉన్నాయని మండల కేంద్రంలో ఐటిఐ కళాశాల ఏర్పాటైతే విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆయా పరిశ్రమంలో వివిధ రంగాల్లో ఉద్యోగాలు లభిస్తే వారి కుటుంబాలు ఆర్థికంగా మెరుగై తల్లిదండ్రులకు అండగా నిలుస్తారని ఆయన వినతిపత్రంలో తెలిపారు.

## బుదిగుమ్మలో కనుల పండుగగా శ్రీ హనుమంతరాయ స్వామి రథోత్సవం

### అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

బెలుగుప్ప, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త



రథత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని బూదిగుమ్మలో శ్రీ ఆంజనేయస్వామి తిరునాళ్లలో భాగంగా క్రోధి నామ సంవత్సరం మాఘ శుద్ధతదియ శనివారం శ్రీ హనుమంతరాయ స్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారూ. కార్యక్రమంలో భాగంగాశనివారం వేకువ జామున గంగపూజ గోపూజ శ్రీవారికి శుద్ధోదక పంచామృత అభిషేకంలు అలంకరణ కుంకుమార్చన పుష్పా రచన శ్రీవారి దర్శనం నివేదన తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించడం జరిగింది సాయంత్రం ప్రదోషకాల పూజ శ్రీవారి పల్లికి సేవ గరుడస్తంభ దీపారాధన నిర్వహించి అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు స్వామి వారి విగ్రహ మూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి అలంకరించిన రథోత్సవం లో ఉంచి రథోత్సవముల లాగడం జరిగింది ఈ తిరుణాలలో చుట్టుపక్క గ్రామాల నుంచికాక కర్ణాటక రాష్ట్రం నుంచి అనేక భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని రథం లాగుటలో పోటీపడి రథం లాగడం జరిగింది ఈ పూజా కార్యక్రమలు పూజారిజ్ఞానేశ్వర్ స్వామి, కార్యనిర్వాహణాధికారి అక్కిరెడ్డి దేవస్థానం ధర్మకర్తలు ఎర్రి స్వామి శివశంకరయ్య సలహాదారుడు మురళీకృష్ణ పూజారి వాసుదేవరావు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు భక్తులు పాల్గొని కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ శివ, పోలీస్ సిబ్బంది ఏర్పాటు చేశారు.

## వైభవంగా ప్రాకారోత్సవం

హిందూపురం ఫిబ్రవరి 15 ప్రభాతవార్త





ప్రత్యేకాలంకరణలో శ్రీవారు , పల్లకి సేవలో నవీన్ తదితరులు

పట్టణంలోని శ్రీ పేట వెంకటరమణ స్వామి ఆలయంలో మాఘమాసం శనివారం సందర్భంగా వైభవంగా శ్రీవారి ప్రాకారోత్సవం జరిగింది. ఉభయ దేవేరులతో కలిసి శ్రీ వెంకటరమణుడు పల్లకిపై అధిరోహించగా గోవింద నామస్మరణ చేస్తూ భక్తులు పల్లకి సేవ చేశారు. కార్యక్రమంలో భగీరథి నవీన్ మొదలగువారు పాల్గొన్నారు.

## శివరాత్రి ఉత్సవాలకు అన్నదాన కమిటీ రూ.లక్ష విరాళం

లేపాక్షి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త



లక్ష రూపాయల చెక్కును అందచేస్తున్న దృశ్యం

మండల కేంద్రమైన లేపాక్షిలోని అన్నదాన సేవా ట్రస్ట్ సభ్యులు వీరభద్ర స్వామి ఆలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ కరణం రామానందన్‌కు లక్ష రూపాయల విరాళాన్ని అందచేశారు. ఈ విరాళాన్ని శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే పూలపల్లకి కార్యక్రమానికి వెచ్చించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు అంజనరెడ్డి, రామాంజనేయులు, రాంప్రసాద్, వెచ్చం రవీంద్రనాథ్, వీరన్న, అన్నదాన కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక

లేపాక్షి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త



కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

మండల కేంద్రమైన లేపాక్షి తహశీల్దార్ కార్యాలయంలో శనివారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ జయప్ప ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులతో పాటు మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. ప్రజలు తమ సమస్యలను ఈ ప్రజా సమస్యల పరిష్కారవేదిక దృష్టికి తీసుకరావాలన్నారు. సమస్యలను అర్జీల రూపంలో ఇస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజలు వ్యక్తిగత గ్రామ సమస్యలను ప్రజా సమస్యల పరిష్కారవేదిక దృష్టికి తీసుకరావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, డిప్యూటి తహశీల్దార్ కుమార్ స్వామిరెడ్డి, వన్నూరప్ప, ఆర్ఐ ప్రమీల, తెలుగుదేశంపార్టీ నాయకులు ఆనంద్‌కుమార్, ఈడిగ చంద్రశేఖర్‌గౌడ్, బయనపల్లి రవి, తదితర నాయకులు పాల్గొన్నారు.

## చెత్త నుండి సంపద తయారీపై విద్యార్థులకు అవగాహన

లేపాక్షి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మండల కేంద్రమైన లేపాక్షిలో ఎంపిడిఓ నరసింహమూర్తి ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్‌లో ఎంపిడిఓ నరసింహమూర్తి, ఇఓఆర్‌డి ఆనంద్‌కుమార్, సర్పంచు ఆదినారాయణలు మాట్లాడుతూ ప్రతి మూడవ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా శనివారం చెత్త నుండి సంపద తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి గ్రామాల్లో తడి, పొడి చెత్తపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా వుంచుకునే విధంగా చైతన్యపరచాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రమేష్, సచివాలయం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలలో పరిశుభ్రంగా ఉంచుకోవాలి.. డిపిఓ సుమన

### స్వచ్ ఆంధ్రస్వచ్ఛ దివస్ కార్యక్రమం

### విద్యార్థులు చేత ర్యాలీ మానవహారం ఏర్పాటు



స్వచ్ఛ ఆంధ్రస్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తచెరువు ఫిబ్రవరి 15 ప్రభాతవార్త.

మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని స్వచ్ఛతకు ప్రతీకలగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనపై ఉందని , డిపిఓ సుమన పేర్కొన్నారు కొత్తచెరువు మండల కేంద్రంలోని విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు అధికారులు కలసి స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ దివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు నెహ్రూ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు విద్యార్థుల చేత పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయించారు ఈ సందర్భంగా డిపిఓ సుమన మాట్లాడుతూ స్వచ్ఛ్ఆంధ్ర లక్ష్యాల సాధనలో ప్రజలంతా భాగస్వామ్యులు కావాలి. పర్యావరణాన్ని కాపాడమే లక్ష్యంగా పని చేయాలి. .స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా.. దీర్ఘకాలంగా పేరుకుపోయిన.. చెత్తను, డంపింగ్ యార్డుల ను పూర్తిగా తొలగించే చర్యలు చేపట్టాలన్నారు. చెత్త కాగితాలు, వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్ కాగితలను సంపూర్తిగా తొలగించాలన్నారు స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని.. అత్యంత ప్రధాన్యతతో ప్రత్యేకంగా చేపడుతూనే... దైనందిన రోజువారీ క్లినింగ్ కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నటరాజ్ మేజర్ గ్రామపంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి టిడిపి కన్వీనర్ వలిపి శ్రీనివాసులు సచివాలయ సిబ్బంది ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థుల పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం.. సిపిఎం నిరసన

రాయదుర్గం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కమిటి సభ్యులు బి.మల్లికార్జున ఆరోపించారు. శనివారం కేంద్ర ప్రభుత్వం పై నిరసన వ్యక్తం చేసూనత భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకసర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం మల్లికార్జున మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక బడ్జెట్ అన్నారు. కేవలం బడా వ్యాపారస్తులకు మెయిల్ చేసే బడ్జెట్ అని ఆరోపించారు. కొనుగోలు శక్తి కుచించకపోవడంతో ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ తగ్గిందన్నారు. ఈ సమస్యను పరిష్కరించకపోగా అందుకు విరుద్దంగా మోడీ ప్రభుత్వం సంపన్నులకు రాయితీలు ఇవ్వడం గర్హనీయమన్నారు. ఎనిరుద్యోగ సమస్యపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి పెట్టలేదని ఆరోపించారు. గ్రామీణాభివృద్ధి సామాజిక సంక్షేమం పై గత ఏడాది కేటాయించిన బడ్జెట్ కన్న తక్కువగా ఉందన్నారు. రాష్ట్రంలో బిజెపి నాయకులు కనీసం నోరెత్తడం లేదని పేర్కొన్నారు. సీపీఎం సీనియర్ నాయకులు నాగరాజు, సభ్యులు మధు, తిమ్మరాజు, కృష్ణానాయక్, ఆంజినేయులు, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రాయదుర్గం పాస్టర్ల సర్వసభ్య సమావేశం

గుమ్మఘట్ట ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

రాయదుర్గం నియోజకవర్గం పాస్టర్లు శనివారం సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. ముఖ్య ప్రసంగికులుగా జిల్లా పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యాక్షులు మార్కు, రాయదుర్గం యోహాను పాల్గొని ప్రసంగిస్తూ దైవజనులగా ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి ఒకరినొకరు ఐక్యత కలిగి ఉండాలి సంఘాలను అభివృద్ధి చేసుకోవాలి నియోజకవర్గంలో ఉన్నటువంటి సంఘ కాపరులకు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఒకరికొకరు తోడ్పాటుగా ఐక్యత తో ఉండాలని పేర్కొన్నారు. తదనంతరం జిల్లా పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మార్కు కు సన్మానం చేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం నియోజకవర్గం సంఘం అధ్యక్షులు పాస్టర్ హరికృష్ణ ఉపాధ్యాక్షులు పాస్టర్ సురేష్ సెక్రటరీ పాస్టర్ సతీష్ దానియేలు ట్రెజరర్ పాస్టర్ జాన్ పాల్ కార్యవర్గ కమిటీ లు సుందర్ రాజు, మోషే,ఆనంద్, జాన్సన్,సోలోమోను, ప్రసాద్,ఆయా గ్రామాల పాస్టర్లు పాల్గొన్నారు.

## కక్కలపల్లి కాలనీ పరిశుభ్ర గ్రామంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం

**- కక్కలపల్లి క్లస్టర్ గ్రేడ్I పంచాయతీ కార్యదర్శి హిదయాతుల్లా**



**స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రం చేయిస్తున్న కార్యదర్శి హిదయాతుల్లా**

**అనంతపురం రూరల్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తీర్చి దిద్దాలనే లక్ష్యంలో భాగంగా నెలలో ఒక రోజు స్వచ్ఛత కోసం అంకితం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలు అదే విదంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు మేరకు అనంతపురం రూరల్ మండలం లో కక్కలపల్లి కాలనీ గ్రామ పంచాయతీ లో స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివాస్" కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం కక్కలపల్లి కాలనీ, పంచాయతీ లో కక్కలపల్లి క్లస్టర్ గ్రేడ్ 1 కార్యదర్శి హీదయ తుల్లా స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించి పంచాయతీ కార్మికులతో గ్రామంలోని చెత్త మొత్తం శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశం లోని అత్యంత పరిశుభ్రత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తీర్చ దిద్దాలని సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుకు సాగడం జరుగుతుందని, అందులో భాగంగానే ఈ స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ ది వాస్ కార్యక్రమాన్ని రాప్తాడు నియోజకవర్గం ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు కక్కలపల్లి కాలనీ గ్రామ పంచాయతీలలో మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించి గ్రామంలోని చెత్త మొత్తం శుభ్రం చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం జరిగిందన్నారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## దేవుని కృపతో అందరూ క్షేమంగా ఉండాలి

**-శ్రీశ్రీశ్రీ వీరముసలమ్మ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తాం**
**- తొత్తిరెడ్డి ముసలిరెడ్డి, తొత్తిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి**
**- శ్రీశ్రీశ్రీ వీరముసలమ్మ తల్లిని దర్శించుకున్న ఎంపీ అంబికా లక్ష్మినారాయణ**
**-ఘనంగా శ్రీశ్రీశ్రీ వీరముసలమ్మ గోపుర సంప్రోక్షణ శిఖర కలశ ద్వజస్తంభ ప్రతిష్ఠ**



**తొత్తిరెడ్డి ముసలిరెడ్డి కుటుంబంతో ఎంపీ అంబికా లక్ష్మినారాయణ**

**పామిడి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

దేవని కృపతో అందరూ క్షేమంగా ఉండాలని టిడిపి రూరల్ కన్వీనర్ తొత్తిరెడ్డి ముసలిరెడ్డి, ఆయన తనయుడు యువనాయకుడు తొత్తిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. మండల పరిదిలోని అనుంపల్లి గ్రామ శివారు ప్రాంతంలో వెలసిన శ్రీశ్రీశ్రీ వీరముసలమ్మ తల్లి దేవాలయ అభివృద్దిలో బాగంగా టిడిపి రూరల్ కన్వీనర్ తొత్తిరెడ్డి ముసలిరెడ్డి, ఆయన తనయుడు యువనాయకుడు తొత్తిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి తమ సొంత నిధులను వెచ్చించి చేపట్టిన గోపుర సంప్రోక్షణ శిఖర కలశ ద్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శనివారం అర్చనలు అభిశేకాల అనంతరం పూజలు జరుపుతూ అర్చకుల వేద మంత్రాల మద్య శాస్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మనిషిని మనిషిగా గుర్తించి ఆపదలో ఆదుకున్నప్పుడే నిజమైన సేవకుడిగా గుర్తింపును సాధిస్తామని ఈనేపద్యంలో సేవాదృక్పదంతో ముందుకెళ్తే నిరంతరం పరమాత్ముని కృఫ మనపై ఉంటుందన్నారు. సంపాదించిన దానిలో కొంత సామానికసేవ, నిరుపేదలను ఆదుకోవటం, ఆద్యాత్మికతకు వినియోగించటం ద్వార మానవ జన్మకు సార్ధకం ఏర్పడుతుందని తెలిపారు. శ్రీశ్రీశ్రీ వీరముసలమ్మ దేవాలయ అభివృద్ధికి ఎళ్ళవేళలా కృషి చేస్తామని వెల్లడించారు. అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మినారాయణ. టిడిపి జిల్లా అద్యక్షులు వెంకటశివుడుయాదవ్, జిల్లా డాక్టర్స్ విభాగం అద్యక్షురాలు పత్తి హిమబిందు దేవాలయంలో చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. తొత్తిరెడ్డి ముసలిరెడ్డి కుటుంబం తమ సొంత నిధులను వెచ్చించి శ్రీశ్రీశ్రీ వీరముసలమ్మ గోపుర సంప్రోక్షణ శిఖర కలశ ద్వజస్తంభ ప్రతిష్ఠ చేపట్టడం శుభపరిణామం అన్నారు. పెద్దఎత్తున తరలివచ్చిన భక్తాదులు శ్రీశ్రీశ్రీ వీరముసలమ్మ తల్లిని దర్శించుకుని పూజలు చేపట్టి తీర్థప్రసాదాలను స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులవ్వగా అక్కడ పండుగ వాతావరణం నెలకొంది.

## పట్టాదారు పాస్ పుస్తకానికి ఐడి నమోదును త్వరగా పూర్తి చేయాలి

**ఏ ఈ ఓ లు, వీహెచ్‌ఈఎ కు తెలియజేసిన ఏ డి ఏ రవి**



**ఏఈఓలు, విహెచ్ఎ తో మాట్లాడుతున్న ఏ డి ఏ రవి**

**అనంతపురం రూరల్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పట్టాదారు పాసు పుస్తకం కలిగిన ప్రతి రైతుకు ఒక కొత్త ఐడి నెంబర్ ను రైతు సేవా కేంద్రాల్లో త్వరగా నమోదు చేయించాలని ఏ డి ఏ రవి, ఏఈఓ లు మురళీకృష్ణ, అలేఖ్య, వీహెచ్‌ఈఎ లకు తెలియజేశారు. శనివారం ఆయన అనంత రూరల్ మండల ఏవో కార్యాల యాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాసుపుస్తకానికి ఐడి నెంబర్ ఉంటేనే పంట నమోదు, పిఎం కిసాన్, ఇన్పుట్ సబ్సిడీ, ఇన్సూ రెన్స్ పనిముట్లు, రాయితీ విత్తనం లబ్ది.., ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో పంట ఉత్పత్తుల అమ్మకాలు.. వంటి తదితర పనులకి తప్పనిసరి నమోదు చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేసిందన్నారు. ప్రతి ఒక్కరికి ఆధార్ నెంబర్ ఏ విధంగా ఉన్నదో ఆ విధంగా సాగు భూమి కలిగిన ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడెంటిఫికేషన్ నెంబర్ కలిగి ఉండాలన్నారు. రైతులు తమ పట్టా దారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ కార్డు కి అనుసంధానం అయినా మొబైల్ ఫోన్ నెంబర్ తో రైతు సేవ కేంద్రాలలో ఉన్న వ్యవసాయ సిబ్బందిని కలిసి రిజిస్ట్రేషన్ చేయించాలని ఏఈఓ లకు, సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ లు మురళీకృష్ణ, అలేఖ్య, విహెచ్ఎలు పాల్గొన్నారు.

## ఘనంగా స్వచ్ఛ ఆంధ్రస్వచ్ఛ దివస్ వేడుకలు




**ప్రతిజ్ఞ చేస్తున్న కార్మికులు**

**నార్పల,ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నార్పల మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం, మేజర్ పంచాయితీ కార్యాలయం, సచివాలయాలతో పాటు మండలంలోని అన్ని పంచాయతీల్లో అధికారులు, సచివాలయ సిబ్బంది, అంగన్ వాడి వర్కర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి, గ్రామీణ ప్రజలకు పొడి చెత్త, తడి చెత్త యొక్క ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. చెత్త సంపద కేంద్రాల వినియోగం గురించి వివరించారు. నార్పల మేజర్ పంచాయితీలోని చింతవనం కొట్టాలలో, సర్పంచ్ సుప్రియ, ఈఓఆర్డి శైలజారాణి, కార్యదర్శి శ్యామల ఆధ్వర్యంలో చెత్త వేరు చేసే విధానాన్ని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగావతి, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ జనార్దన్, ఏఓ ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శులు శ్యామల, శ్రీనివాసులు, వెంకట రమణ, గోపాలరెడ్డి, హర్షవర్ధన్, కుళ్లయ్యప్ప, చినరాయుడు, లక్ష్మీదేవి, వరలక్ష్మి, కీర్తన, రాజేశ్వరి, మాధవి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రాంకీ, రంజిత్, చంద్రబాబు, రామేశ్వరి, సునీల్, శ్రీనాథ్, వినయ్, జగదీష్, ప్రత్యూష, జయసింహ, మహేష్, ఉపాధి హామీ సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది, గడ్డంనాగేపల్లి సర్పంచ్ నాగన్న తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన పెంచడంతో పాటు, చెత్తను సద్వినియోగం చేసుకునే మార్గాలను వివరించడం జరిగింది.

## ఏ. నారాయణపురంను పరిశుభ్ర గ్రామంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం

**- గ్రేడ్1 పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ బాబు.**



**స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో సిబ్బందితో కలిసి ర్యాలీ చేస్తున్న కార్యదర్శి ప్రవీణ్ బాబు**

**అనంతపురం రూరల్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

మండలంలోనే అత్యంత పరిశుభ్ర గ్రామంగా ఏ. నారాయణపురం పంచాయతీని తీర్చి దిద్దాలనే లక్ష్యంలో భాగంగా నెలలో ఒక రోజు స్వచ్ఛత కోసం అంకితం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలు అదే విదంగా అనంత అర్బన్, రాప్తాడు ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, పరిటాల సునీత పిలుపు మేరకు అనంతపురం రూరల్ మండలంలోఏ.నారాయణపురం గ్రామ పంచాయతీ లో స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివాస్" కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఏ.నారాయణపురం పంచాయతీ లో గ్రేడ్ 1 కార్యదర్శి ప్రవీణ్ బాబు స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించి పంచాయతీలో సచివాలయ సిబ్బంది కార్మికులతో కలసి గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించి అనంతరం కార్మికులతో చెత్త మొత్తం శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశంలోని అత్యంత పరిశుభ్రత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తీర్చదిద్దాలని సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుకు సాగడం జరుగుతుందని, అందులో భాగంగానే ఈ స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ ది వాస్ కార్యక్రమాన్ని అనంత అర్బన్, రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యే లు దగ్గుపాటి ప్రసాద్, పరిటాల సునీత ఆదేశాల మేరకు ఏ. నారాయణపురం, పాపంపేట లో మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించి గ్రామంలోని చెత్త మొత్తం శుభ్రం చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం జరిగిందన్నారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.కె.యూనివర్సిటీ ఘన విజయం

**- రామాంజనేయులు (89), సాయికృష్ణ (50) అర్ధ సెంచరీ**



**విజయం సాధించిన జట్టు**

**అనంతపురం క్లక్ టవర్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఉద్యోగుల క్రికెట్ టోర్నమెంట్లో శనివారం ఎస్.కె.యూనివర్సిటీ డియంహెచ్ఓ పోటీపడ్డాయి టాస్ గెలిచిన డియంహెచ్ఓ బ్యాటింగ్ ఎంచుకుంది నిర్ణిత 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 166 పరుగులకు తీశారు రామాంజినేయులు 45 బంతుల్లో 6 సిక్సర్లు 7 ఫోర్లతో 89 పరుగులు, లక్ష్మీనారాయణ 47 బంతుల్లో 2 ఫోర్లతో 40 పరుగులు, గంగాధర్ 17 బంతుల్లో 2 ఫోర్లతో 13 పరుగులు చేశారు. ఎస్.కె.యూనివర్సిటీ బౌలర్లు మారుతి, ప్రణీత్ ఒక్కొక్క వికెట్ తీసుకున్నారు. 167 పరుగులను 15 ఓవర్లలో పూర్తి చేసి 4 వికెట్లతో ఎస్.కె.యూనివర్సిటీ విజయం సాధించింది ఎస్కేయూ బ్యాటర్లు సాయి కృష్ణ 17 బంతుల్లో 6 సిక్సర్లు, 2 ఫోర్లుతో 50 పరుగులు సాధించి నాటౌట్ గా నిలిచాడు. ఇలియాజ్ 22 బంతుల్లో 2 సిక్సర్లు 5 ఫోర్లు 40 పరుగులు, ప్రణీత్ రాజ్ 22 బంతుల్లో 2 సిక్సర్లు, 4 ఫోర్లతో 38 పరుగులు సాధించారు ఎస్కేయూ బౌలర్లు జగన్ 2, రామాంజనేయులు, నారాయణ స్వామి ఒక్కొక వికెట్ తీసుకున్నారు.

## గౌతమి పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : ఐద్వా,ఎస్ఎఫ్ఐ



**ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం**

**అనంతపురం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

అన్నమయ్య జిల్లా మదనపల్లిలో గౌతమి పై యాసిడ్ దాడి చేసి కత్తితో పొడిచిన గణేష్ పై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఐద్వా,ఎస్ఎఫ్ఐ ఆధ్వ ర్యంలో స్థానిక అనంతపురం టవర్ క్లాక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి గారు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై జరుగు తున్న అత్యాచారాలపై సమగ్రమైన విచారణ చేయాలి అదే విధంగా మహిళలపై జరుగుతున్న దాడులు అరికట్టాలి అని అన్నారు అన్నమయ్య జిల్లా మదనపల్లి ప్రాంతంలో బ్యూటీ పార్లర్ లో ఉద్యోగం చేస్తున్న గౌతమి అదే ప్రాంతానికి చెందినటువంటి గణేష్ రెండు సంవత్సరాల నుంచి ప్రేమించాలని వెంటపడుతూ వేధిస్తూ ఉండడంతో గౌతమి ఉద్యోగం మానేసి ఇంటికి వెళ్లి పోయింది ఇంట్లో ఉన్నటువంటి తల్లిదండ్రులు ఈ విషయాన్ని తెలుసుకున్న తర్వాత వారి బంధువులతో ఫిబ్రవరి 2వ తేదీన నిశ్చితార్థం చేశారు గౌతమి కు ఏప్రిల్ 15వ తేదీన వివాహం చేయాలని తల్లిదండ్రులు అనుకున్నారు ఇదే విషయాన్ని తెలుసుకున్నటువంటి గణేష్ ఫిబ్రవరి 14వ తేదీన ఉదయం 6:00 గంటలకు గౌతమి సొంత గ్రామానికి చేరుకొని తల్లిదండ్రులు ఉదయమే పొలం పనులకు వెళ్లిన తర్వాత గౌతమి ఇంట్లోకి చొరబడిన గణేష్ యాసిడ్ నోట్లకు పోసి చంపేసే ప్రయత్నం చేశాడు తప్పించుకునే ప్రయత్నం చేసిన గౌతమి పై యాసిడ్ తో దాడి చేసి తనతో తెచ్చుకున్నటువంటి కత్తితో పొడవడం జరిగింది ప్రస్తుతం గౌతమి ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా ఉంది దాడి చేసి తప్పించుకున్న గణేష్ పై కఠినమైన చర్యలు తీసుకోవాలి అదేవిధంగా రాష్ట్రంలో ఈ మధ్య కాలంలో మహిళలపై విద్యార్థినిలపై యుటీజింగ్ ర్యాగింగ్ తో పాటు అత్యాచారాలు తీవ్రంగా పెరిగాయి వీటిపై రాష్ట్ర ప్రభుత్వం మరియు హోం శాఖ మంత్రి గారు దృష్టి పెట్టి పని చేయాలి మహిళలకు రక్షణ కోసం ప్రత్యేక చట్టాలను ఏర్పాటు చేయాలని ప్రతి జిల్లాలో ఫస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలిని ఈ సందర్భంగా ఐద్వా ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దు ఉపాధ్యక్షుడు గిరి, సహాయ కార్యదర్శి శివ, సోము ఐద్వా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు చంద్రిక, అశ్విని, రేణుక పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ పద్దతులతో అధిక దిగుబడులు

**బుక్కరాయసముద్రం ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**



**భీజామృతం,ఘనజీవామృతంతో విత్తనశుద్ది చేస్తున్న దృశ్యం**

ప్రకృతి వ్యవసాయ పద్దతులు రైతులందరు పాటిస్తే అధిక దిగుబడులు సాదించవచ్చని ప్రకృతి వ్యవసాయం ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ నవీన్ అన్నారు. శనివారం బుక్కరాయ సముద్రం గ్రామానికి చెందిన రేణుకాఎల్లమ్మ గ్రామైఖ్య సంఘం లోని గంగా మహిళసంఘం సభ్యురాలైయిన కొప్పల సుప్రియ భర్త పెద్దిరెడ్డి అనే రైతు పొలంలో ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కల్పిస్తూ ఒక ఎకరా మామిడిలో అధిక దిగుబడులు సాదించుట కొరకు పి.ఎం.డి.ఎస్ పద్దతులు పాటించారు. ఇందులో ప్రధానంగా ఐదు రకాల పంటలు ఉంటాయి, సద్ద, కంది, ఆముదం, అనుములు, గోరుచిక్కుడు ఉంటాయన్నారు. వీటితోపాటు 20 రకాల విత్తనాలను జీవవైవిద్య పంటల విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్దిచేసి ఘనజీవామృతం తోపాటు విత్తడం జరిగిందన్నారు. దీనివల్ల రాబోయే రోజుల్లో అధిక ఉష్ణోగతలను తట్టుకొని అదిక దిగుబడులు పొందడానికి ఈ పద్దతిని పాటించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు రాజేశ్వరి, చంద్రశేఖర్, వాసవి, పెద్దన్న, ఎలిషా తదితిరులు పాలొంగన్నారు.

## పరిశుభ్ర గ్రామంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం

**సర్పంచ్ సావిత్రి శ్రీనివాసులు, గ్రేడ్I పంచాయతీ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్**

**అనంతపురం రూరల్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**



**గ్రామంలో సిబ్బందితో కలిసి ర్యాలీ చేస్తున్న సర్పంచ్,కార్యదర్శి.**

మండలంలోనే అత్యంత పరిశుభ్ర గ్రామంగా ఉప్పరపల్లి పంచాయతీని తీర్చి దిద్దాలనే లక్ష్యంలో భాగంగా నెలలో ఒక రోజు స్వచ్ఛత కోసం అంకితం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలు అదే విదంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు మేరకు అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి గ్రామ పంచాయతీ లో స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివాస్" కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఉప్పరపల్లి పంచాయతీ లో సర్పంచ్ సావిత్రి శ్రీనివాసులు, గ్రేడ్ 1 కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించి పంచాయతీలో సచివాలయ సిబ్బంది కార్మికులతో కలసి గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించి అనంతరం కార్మికులతో చెత్త మొత్తం శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని అత్యంత పరిశుభ్రత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తీర్చదిద్దాలని సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముందుకు సాగడం జరుగుతుందని, అందులో భాగంగానే ఈ స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ ది వాస్ కార్యక్రమాన్ని రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు ఉప్పరపల్లి పంచాయతీ లో మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించి గ్రామంలోని చెత్త మొత్తం శుభ్రం చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం జరిగిందన్నారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## క్లస్టర్ కాంప్లెక్స్ క్లోజింగ్ అటెండెన్స్‌ను లాక్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

**అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

ఈ నెల 15వ తేదీ నిర్వహించిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల ముగింపు సమయం ఐదు గంటలకే ఉన్నప్పటికీ 5:30 ల వరకు అటెండెన్స్ పడకుండా లాక్ చేయడాన్ని అనంతపురం జిల్లా ఎస్ టి యు జిల్లా శాఖ తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు ఎన్.రమణా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో, మారుమూల ప్రాంతాల్లో హాజరైన ఉపాధ్యాయులు ముఖ్యంగా మహిళ ఉపాధ్యాయులు బస్సు సౌకర్యం లేనటువంటి ప్రాంతాల్లో, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సీనియర్ ఉపాధ్యాయులకి మరియు దివ్యాంగుల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు ఇది ఎంతో ఇబ్బంది కలిగించే ప్రమాదం ఉందన్నారు. ఉదయం ఎప్పుడో 5 గంటలకి ఇంటిలో బయలుదేరినప్పుడు ఫోన్ చార్జింగ్ పెట్టి ఉంటారని ,సాయంత్రం 6 గంటలైనా అటెండెన్స్ తీసుకోకపోతే ఫోన్లో చార్జింగ్ కూడా ఉండే అవకాశం లేదని ,అలాంటప్పుడు ఎలా అటెండెన్స్ వేయడానికి వీలవుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇది చాలా దారుణన్నారు. ఉపాధ్యాయులు రాత్రికి ఎప్పుడో గాని ఇంటికి చేరే పరిస్థితి లేదని , ఇంతటి దారుణాన్ని ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం ,అధికారులు చూపించడం సమంజసం కాదని, దీనిని ఎస్ టి యు తీవ్రంగా ఖండిస్తుందని, వెంటనే సమయాన్ని మార్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల సమయం నాలుగు గంటలకే ముగించాల్సి ఉండగా, కాంప్లెక్స్ మీటింగ్ పేరుతో ఐదు గంటల వరకు సమయాన్ని పెంచడమే కాకుండా ఐదున్నర గంటల వరకు అటెండెన్స్ పడకుండా చేయడం అమానుషమన్నారు. కావున వెంటనే క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల సమయాన్ని నాలుగు గంటల వరకే కుదించి, మొత్తం ఒక రోజు ఉండేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ తక్షణమే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## కేంద్రం యూజీసీ 2025 నోటిఫికేషన్‌ని వెంటనే వెనక్కి తీసుకోవాలి

**- వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్**




**విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్ యాదవ్.**

**అనంతపురం సిటి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

కేంద్రప్రభుత్వం విడుదల చేసిన యూజీసీ 2025 నోటిఫికేషన్ ని వెంటనే వెనక్కి తీసుకోవాలని వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్ డిమాండ్ చేశారు. జిల్లా వైసీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ లో ప్రైవేటు రంగానికి చెందిన వ్యక్తులను, అకాడమిక్ గురించి ఎటువంటి అనుభవం లేని వ్యక్తులను యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్గా నియమించే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా ఉన్నత విద్యను పూర్తి స్థాయిలో వ్యాపారమయం చేసి తమ కార్పొరేట్ ఆశయాలను నెరవేర్చు కోవాలని చూస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నా యన్నారు. నోటిఫికేషన్ కు మద్దతు ఇస్తూ ప్రభుత్వ విద్యను ప్రైవేటు పరం చేయడం కోసం రాష్ట్రంలో టిడిపి జనసేన అడుగులు వేస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా యుజిసి డ్రాఫ్ట్ 2025 నోటిఫికేషన్ కు వెనక్కు తీసుకోవాలన్నారు. సమావేశంలో వైయస్సార్ విద్యార్థి విభాగం నగర అధ్యక్షులు కైలాష్ నాయకులు వెంకట్, బోయ నితిన్, రాహుల్ రెడ్డి, బోయ శ్రీనివాస్, శివ, శారిక్, సూర్య రెడ్డి, సురేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు

**అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**



**జ్యోతి ప్రజ్వల చేస్తున్న దృశ్యం**

జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు ముగింపు కార్యక్రమం శనివారం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజ్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సుదర్శన రావు మాట్లాడుతూ... విద్యార్థులు రోడ్డు భద్రత రాయబారులుగా ఉండాలని, వారి జీవిత లక్ష్యాలను సాధించాలంటే ఆరోగ్యంగా ఉండాలని, అలా ఉండాలంటే రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ ఉండాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులను, మిగిలిన వ్యక్తులను కూడా రోడ్డు భద్రత నియమాలు పాటించే విధంగా చూడాల్సిన సామాజిక బాధ్యత విద్యార్థులపై ఉందని తెలియజేశారు. ఉప రవాణా కమిషనర్ ఎం. వీర్రాజు మాట్లాడుతూ... గత నెల రోజులలో 64 రోడ్డు భద్రత అవగాహన సదస్సులు, ర్యాలీలు ఏర్పాటు చేశామని, తద్వారా 20వేల మంది డ్రైవర్లకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించామని, జిల్లాలోని అన్ని హైస్కూలు, జూనియర్ కాలేజీలలో ఒకేరోజు రెండు లక్షల 50 వేల మంది విద్యార్థులను రోడ్డు భద్రతా కార్యక్రమాల్లో పాల్గొనేలా చేసామని, ఆరు వైద్య శిబిరాలు ద్వారా 543 మంది డ్రైవర్లకు పరీక్షలు నిర్వహించామని తెలియజేశారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన వ్యాసరచన, వకృత్వ పోటీలలో ఉత్తమ బహుమతి పొందిన విద్యార్థులకు జ్ఞాపకలను మరియు సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ చెన్నారెడ్డి, అనంతపురం డిఎస్పి శ్రీనివాసరావు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి వెంకటరమణ నాయక్, ఆర్టీవోలు సురేష్ నాయుడు, రమేష్, రవాణా శాఖ అధికారులు, ఎన్జీవోలు , విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్డిటి అకౌంటెంట్ పై చర్యలు తీసుకోండి

**కూడేరు, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

కూ దేరు మండల పోలీస్ స్టేషన్లో తొమ్మిది గ్రామాల ఎస్సీ సంఘ సభ్యులు కూడేరు సిఐ రాజుకు శనివారం ఆర్డిటి అకౌంటెంట్ మల్లికార్జున పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు, ఈ సందర్బంగా తొమ్మిది గ్రామాల ఎస్సీ సంఘ సభ్యులు మాట్లాడుతూ, రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ అనంతపురం వారి సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామ స్వరాజ్య నిధి పేరుతో ఆర్డిటి సహకారంతో కొంత నగదును ఇద్దరి మా సంఘ సభ్యుల పేరుతో ఉరవకొండ లోని యూనియన్ బ్యాంక్ లో ఫిక్స్ డిపాజిట్ చేసాము, ఆ వడ్డీతో వచ్చేటువంటి డబ్బుతో కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే వాళ్ళము అని తెలిపారు, దీనికి సంబంధించిన చెక్కుబుక్కులను ఉరవకొండ ఆర్డిటి ఆఫీసులో అకౌంటెంట్గా పని చేస్తున్న మల్లికార్జున వద్ద భద్రపరిచి ఉన్నాము, ఇటీవల కాలంలో అకౌంటెంట్ మల్లికార్జున బదిలీపై వెళ్లడంతో ఆర్డిటి ఆఫీసు నందు ఏరియా టీమ్ లీడర్ సహాయంతో చెక్కు బుక్కులను తనిఖీ చేయగా అందులో రెండు చెక్కుబుక్కులను అకౌంట్ గా పనిచేస్తున్న మల్లికార్జున దొంగలించి అందులో 15,6,943 రూపాయలు డ్రా చేసినట్లు విషయం బయటపడింది, మల్లికార్జున పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కూడేరు సిఐ కు ఫిర్యాదు చేసినట్లు తొమ్మిది గ్రామాల ఎస్సీ సంఘాల సభ్యులు తెలిపారు.

**BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL CUM 1st ADDITIONAL DISTRICT JUDGE, ANANTHAPURURAMU**
**M.V.O.P NO. 262/2024**
**Between:**
Pathyala Gangadri **...Petitioner**
Vs.
R.Krishna Murthy @ Krishna & others **...Respondents**
**NOTICE TO RESPONDENT No.1&2**
To,
1.R.Krishna Murthy @ Krishna **(R-1)** S/o R. Yarra Nagappa,
2. M.Raju **(R-2)** S/o M.Chinna Gurappa
Both are R/o Peravali Village, Singanamala Mandal, Anantapur District.
Whereas the above named petitioner has been made an application to this court for grant of compensation against you, you are hereby wanted to appear in the court in person or through a pleader duly instructed on the **10th day of March, 2025** at 10.30 AM to show cause against the application, failing which said application will be heard and determined ex-parte.
*By order of Court*
**B.Narayana Reddy,**
Advocate for Petitioner, Anantapur.

## సి టి ఏ డైరీ ఆవిష్కరణ



**డైరీ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ అనిత**

**అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘము నూతన డైరీ 2025 ను శనివారం శ్రీ కృష్ణ దేవరాయ విశ్వావిద్యాలయం వైస్ ఛాన్స్ లార్ ప్రొఫెసర్ అనిత చే ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వీసీ ,రిజిస్ట్రార్ ఉమ్మడి జిల్లా లోని నిఅధ్యాపకులు కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో రిజిస్ట్రార్ డా.ఈ.రమేష్ బాబు , అనంతపురం జిల్లా ప్రభుత్వడిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం అధ్యక్షులు డాక్టర్ కొనంకి శ్రీధర్, కార్యదర్శి డాక్టర్ ఎం.బాలాజీనాయక్, ఆర్ట్స్ కళాశాల యూనిట్ అధ్యక్షులు డా.డి.చంద్రశేఖర్, డా.తిరుమలేష్ ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతుకి ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య

**శింగనమల ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**



**అన్వేష్ కుమార్**

భూమిగల ప్రతి రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి ఎన్ అన్వేష్ కుమార్ తెలిపారు. శనివారం అయిన పత్రిక ప్రకటన విడుదల చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పట్టాదారు పాసు పుస్తకం కలిగిన ప్రతి రైతు ఒక కొత్త ఐ డి నెంబర్ ని కలిగిఉండాలి ఆ ఐ డి నెంబర్ పంట నమోదు, పీఎం కిసాన్. ఇన్పుట్ సబ్సిడీ. ఇన్సూరెన్స్. రాయితీ విత్తనం లబ్ధి, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో పంట ఉత్పత్తుల అమ్మకాలు. వంటి తదితర పనులకి తప్పనిసరి.ప్రతి ఒక్కరికి ఆధార్ నెంబర్ ఏ విధంగా ఉన్నదో.. ఆ విధంగా సాగు భూమి కలిగిన ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ ఐడెంటిఫికేషన్ సంఖ్య ని కలిగి ఉండాలి. ఇందుకు రైతులు, వారి పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ కార్డు కి అనుసంధానం అయినా మొబైల్ నెంబర్ తో రైతు సేవ కేంద్రాలలో ఉన్న వ్యవసాయ సిబ్బంది ని కలిసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

## పల్లా శ్రీనివాస్ యాదవ్ ను కలిసిన డేగ

**శింగనమల ఫిబ్రవరి 15 ప్రభాతవార్త.**

మంగళగిరి లోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్ ని శనివారం అనంతపురం జిల్లా టిడిపి అధికార ప్రతినిధి మరియు రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి జిల్లా తెలుగుదేశం పార్టీ టి ఎన్ టి యు సి జిల్లా అధికార ప్రతినిధి నిట్టూరు శివాజీ మర్యాదపూర్వకంగా కలిశారు.



**పల్లా శ్రీనివాస్ యాదవ్ తో డేగల కృష్ణమూర్తి.**

# మున్సిపల్ అధికారులు బాధ్యతగా పనిచేయండి

- సత్యసాయిబాబా శతజయంతి వేడుకలకు పుట్టపర్తిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దండి
- మున్సిపల్ అత్యవసర కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**పుట్టపర్తి టౌన్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి అధికారులు బాధ్యతతో పనిచేయాలని నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మున్సిపల్ అధికారులకు సూచించారు. శనివారం పుట్టపర్తి మున్సిపల్ అత్యవసర కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ఏడాది 2025 నవంబర్ మాసంలో జరిగే భగవాన్ శ్రీ సత్య సాయిబాబా శత జయంతి వేడుకలకు పుట్టపర్తి నగరాన్ని అత్యంత సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. పుట్టపర్తి మున్సిపాలిటీలో వీధిలైట్లు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేయాలని తెలిపారు. పుట్టపర్తి సాయి బాబా నడయాడిన పవిత్ర ప్రాంతమని ఈ ప్రాంతానికి సుమారు 135 దేశాల నుంచి దేశ విదేశాల భక్తులు విచ్చేస్తారని అందుకు అనుగుణంగా సౌకర్యాలు సమకూర్చాలని తెలిపారు. మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజాభివృద్ధికి పాటుపడాలని కోరారు. కొంతమంది అధికారుల అలసత్వం వల్ల పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధి కుంటుపడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్రావతి నది సుందరీకరణకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. చిత్రావతి నదిలో సత్య సాయిబాబా విగ్రహాన్ని నెలకొల్పే విధంగా అందుకు తగ్గ ఏర్పాట్లు సత్వరమే చేయాలని సూచించారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో ఎక్కడ త్రాగునీరు, విద్యుత్ లైట్లు, రోడ్లు లేవన్న మాట ప్రజల నుంచి రాకూడదని, అధికార యంత్రాంగానికి సూచించారు. అదేవిధంగా కర్ణాటక నాగేపల్లి నుంచి చిత్రావతి బ్రిడ్జి మీదుగా సాయి నగర్ పడమర గేటు వరకు రోడ్డు వెడల్పు కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. అదేవిధంగా పడమర గేట్ నుంచి కమ్మవారిపల్లి సర్కిల్ ,పుట్టపర్తి ప్రధాన రహదారి సమీపంలోని పెట్రోల్ బంకు వరకు తారు రోడ్డును అందంగా తీర్చిదిద్దాలని తెలిపారు. మున్సిపల్ వాహనాలను వెంటనే మరమ్మతు చేసి ఇంటింటికి చెత్త సేకరణ కార్యక్రమాన్ని అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటింట సేకరణ అస్తవ్యస్తంగా సాగిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పుట్టపర్తి ప్రధాన రహదారి పై మురుగు నీరు పారకుండా మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సూచించారు. మనమందరం కలిసికట్టుగా పుట్టపర్తి అభివృద్ధికి పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద, డిఈ నరసింహ మూర్తి, మున్సిపల్ కౌన్సిలర్లు రత్నప్ప చౌదరి, లక్ష్మీపతి, ఇతర కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

## నాటి మిత్రులు నేటి వియ్యంకులు

ఎమ్మెల్యే సురేంద్రబాబు కూతురు చరితతో, చిరకాల మిత్రుడు రాజగోపాల్ కుమారుడు రాహుల్ తో వివాహ నిశ్చితార్థం



ఎమ్మెల్యే సురేంద్రబాబు కూతురు నిశ్చితార్థ వేడుకల్లో తాంబూలాలు మార్చుకుంటున్న దృశ్యం

**కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

చిరకాల మిత్రులు, ఎస్సార్ కన్స్ట్రక్షన్స్ కంపెనీలో భాగస్వాములు, అరమరికలు లేని స్నేహం కూతురు వివాహంతో వియ్యంకులుగా మారిన స్నేహబంధం. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు కూతురు చి"సౌ" చరితను తన చిరకాల స్నేహితుడు, వ్యాపార భాగస్వామి రాజగోపాల్ కుమారుడు చి"రాహుల్ వివాహ నిశ్చితార్థం శనివారం బెంగళూరులోని సురేంద్రబాబు స్వగృహంలో వేడుకగా జరిగింది. ఒకప్పటి స్నేహితులు వివాహ బంధంతో వియ్యంకులుగా మారిన సందర్భం అపురూపమని, బంధువులు స్నేహితులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులతో పాటు కళ్యాణ్ దుర్గం నియోజకవర్గానికి చెందిన ముఖ్య తెలుగుదేశం పార్టీ నాయకులు హాజరయ్యారు.

# ఉరవకొండ టౌన్ బ్యాంకు డిపాజిటర్ల ఎదురుచూపులు ఫలించేదెప్పుడో..!

- 4,811 మంది డిపాజిటర్లకు వడ్డీతో కలిపి రూ.5.92 కోట్లు చెల్లింపులు ఎప్పుడో?
- గత ఏడాది జూలై 20వ తేదీన బ్యాంకు లైసెన్సును రద్దు చేసిన ఆర్‌బీఐ
- డిపాడిట్ ఇన్సూరెన్స్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ నుండి క్లైమ్ సెటిలర్‌కై ఎదురుచూపులు

**ఉరవకొండ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

మా ఎదురుచూపులు ఎప్పటికి ఫలిస్తాయోనని ఉరవకొండ కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు డిపాజిటర్లు ప్రశ్నిస్తున్నారు. అధికారులు మాకు డబ్బులిచ్చి ఎపుడు సెటిల్ చేస్తారోనని ప్రతినిత్యం బ్యాంకు వద్దకు వెళ్లడం రావడంతో సరిపోతోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకులో కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయి మూడు సంవత్సరాలు గడిచిపోతున్నా ఇప్పటివరకు మాకు మాత్రం న్యాయం జరుగడంలేదని వాపోతున్నారు. తాము ఇంకెతకాలం ఎదురు చూడాలో అర్థం కావడంలేదని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు సెటిల్‌మెంట్ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతున్నారు. బ్యాంకులో డబ్బులు పెట్టిన 4,811 మంది డిపాజిటర్లకు వడ్డీతో కలిపి 5.92 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉందని సమాచారం. వివరాల్లోకి వెళితే... ఉరవకొండలో 1932లో ప్రారంభమైన కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ గత 2007లో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా గుర్తింపు పొంది 4,700 మంది వరకు రిజిస్టర్ సభ్యులతో దాదాపు 14 కోట్ల రూపాయల వరకు టర్నోవర్‌కు చేరుకుంది. అయితే పాలకవర్గాల నిర్వహణ లోపం, బోగస్ రుణాలు, రికవరీల్లో అక్రమాలతో గత 11 సంవత్సరాలుగా బ్యాంకు నష్టాల్లో కూరుకుపోయింది. ఈ క్రమంలోనే బ్యాంకు మనుగడ ప్రశ్నార్థకమైంది. ఫలితంగా 2021 సెప్టెంబర్ నుండి బ్యాంకులో లావాదేవీలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ క్రమంలోనే గత ఏడాది జూలై 20న ఆర్‌బీఐ బ్యాంకు లైసెన్సును రద్దు చేసింది. ఆ వెంటనే ఆగస్టు 1న జిల్లా సహకార అధికారిను (డీసీఓ) లిక్విడేటర్‌గా నియమించింది. బ్యాంకు ఆర్థిక లావాదేవీలకు సంబంధించి పూర్తి వివరాలను గత ఏడాది అక్టోబర్‌లో డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ (డీఐజీసీ)కు పంపారు. దీంతో వారు ఆడిటర్‌ను నియమించగా ఆయన ఈనెల 10 పూర్తి నివేదికను అందించారు. డీఐజీసీ క్లైమ్ సెటిలర్‌ను నియమిస్తే ఆయన డేటా, రికార్డులు తనిఖీచేసి లిక్విడేటర్ సంతకాలతో సమగ్ర నివేదికను అందజేసిన తరువాత లిక్విడేటర్ ఖాతాకు ఆర్‌బీఐలో వున్న సెక్యూరిటీ డిపాజిట్ 2.94 కోట్ల రూపాయలు మొత్తంతో ఇన్సూరెన్స్ మొత్తం కూడా విడుదలవుతుందని ఆ మొత్తం వస్తే 4,811 మంది డిపాజిటర్లకు 5,92,58,828 రూపాయలు చెల్లించడం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. బ్యాంకు ద్వారా ఇచ్చిన రుణాలకు సంబంధించి ఒక కోటి రూపాయల వరకు రికవరీలు జరుగాల్సి ఉండగా (మార్టిగేజ్ రుణ మొత్తం 80 లక్షలు, ఓడీ 20 లక్షలు) లిక్విడేటర్‌ను నియమించిన నాటి నుండి 40 లక్షల రూపాయలు రికవరీ జరిగాయని కరెంటు ఖాతాలో మరో 20 లక్షల రూపాయలు ఉందని అధికారులు చెబుతున్నారు. డీఐజీసీ అధికారులు కాలయాపన చేయకుండా క్లైమ్ సెటిలర్‌ను వీలైనంత త్వరగా నియమిస్తే డిపాజిట్ల చెల్లింపు ప్రక్రియ వేగవంతం కానుంది.



ఉరవకొండలోని గాంధీ బజార్‌లోగల కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు సొంత భవనం

## పీవీకేకే ఐటీలో రెండు రోజుల సదస్సు

- విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచిన సదస్సు



కార్యక్రమంలో అధ్యాపకులు ధరణి కుమార్ మరియు డా. వీణ

**అనంతపురం, ఫిబ్రవరి 15, (ప్రభాత వార్త బ్యూరో)**

అనంతపురంలోని పీవీకేకే ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం , సిఎస్సి విభాగాలు సంయుక్తంగా ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ , ఎంబెడెడ్ సిస్టమ్స్ పై రెండు రోజుల సదస్సు ఈనెల 14, 15 తేదీలలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు పాల్గొని, ఆధునిక సాంకేతికతలపై అవగాహన పెంచుకున్నారు. ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ లో ఫ్రంట్‌ఎండ్, బ్యాక్‌ఎండ్ డెవలప్‌మెంట్, డేటాబేస్ మేనేజ్‌మెంట్, ఏ.పి.ఐ



డిజైన్ వంటి అంశాలపై నిపుణుల ఉపన్యాసాలు జరిగాయి. అలాగే ఎంబెడెడ్ సిస్టమ్స్ లో మైక్రోకంట్రోలర్లు, సెన్సార్లు, ఆక్చుయేటర్లు, రియల్ టైమ్ సిస్టమ్స్, ఫర్మ్‌వేర్ ఇంజినీరింగ్ వంటి అంశాలపై ప్రాక్టికల్ ట్రైనింగ్ అందించారు. ఈ కార్యక్రమాన్ని సిఎస్సి విభాగాధిపతి డా. ధిలీప్ వెంకట కుమార్, ఎం. ధరణి కుమార్, డా. వీణా లు సమర్థంగా నిర్వహించారు. వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు అభివృద్ధి చేసుకునే అవకాశాన్ని కల్పించిందని నిర్వాహకులు తెలిపారు. కళాశాల చైర్మన్ డా. పల్లె కిషోర్, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. బండి రమేష్ బాబు, ఏ ఓ డా. మనోహర్ రెడ్డి తదితరులు విద్యార్థులను అభినందించారు.

# సైబర్ నేరాల కట్టడికి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

## - జిల్లా ఎస్పి జగదీష్

**అనంతపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

సైబర్ నేరాల కట్టడికి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పి జగదీష్ శనివారం అన్నారు. సైబర్ మోసాలు ఎలా జరుగుతాయి, వాటికి అడ్డుకట్ట వేయాలంటే ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలో సూచించే వీడియోలను డిస్‌ప్లే చేస్తూ ప్రజల్లో చైతన్యం తెస్తున్నామని జిల్లా ఎస్పి తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రచారం చేసే ఆటోలను జిల్లా ఎస్పి జెండా ఊపి ప్రారంభించారు. సైబర్ సురక్ష కార్యక్రమంలో భాగంగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని జిల్లా అంతటా ఆటోల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండలకేంద్రాల్లో ఆటోల ద్వారా నేరాల అప్రమత్తతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. డిజిటల్ అరెస్ట్, ఫేక్‌లోన్ యాప్స్, ఏపికె ఫైల్ లింక్స్, షేర్‌మార్కెట్ మోసాలు, కొరియర్ ఫ్రాడ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, గుర్తుతెలియని వ్యక్తుల ద్వారా వచ్చే వీడియోకాల్స్, ఆర్థిక నేరాలు, తదితర వాటి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. సైబర్ మోసగాళ్ల బారిన పడిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కు సైబర్ క్రైమ్ పోర్టల్ ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పి ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి డి.వి రమణమూర్తి, అనంతపురం డిఎస్పి వి.శ్రీనివాసరావు, ఏఆర్ డిఎస్పి నీలకంఠేశ్వర్‌రెడ్డి, సిఐలు ధరణీకిషోర్, రాజేంద్రనాథ్‌యాదవ్, శ్రీకాంత్‌యాదవ్, శాంతిలాల్, కనుమూర్తి సాయినాథ్, శేఖర్, రఘుప్రసాద్, ఆర్ఐ రాముడు, తదితరులు పాల్గొన్నారు.



ప్రచార ఆటోలను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పి జగదీష్



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పి

# సంపద సృష్టిస్తామని చేతులెత్తేశారు..!

- అపద్ధపు హామీలతో ప్రజలను మోసం చేశారు
- "సూపర్ సిక్స్" అమలు చేసేదాకా ప్రజల పక్షాన పోరాడుతాం
- ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రభుత్వానికి డిపాజిట్లు గల్లంతు
- మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వైవిఆర్

**గుంతకల్లు, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

సంపద సృష్టించి ప్రజలకు పంచుతామని ఎన్నికల ముందు ప్రతి సమావేశంలో మాట్లాడిన చంద్రబాబు అందలమెక్కాక చేతులెత్తేశారని మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. అపద్ధపు హామీలతో అధికారం చేపట్టి ప్రజలను మోసం చేశారని ఆయన మండిపడ్డారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైవిఆర్ మాట్లాడుతూ చెప్పిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసేదాకా ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. త్వరలో జమిలీ ఎన్నికలు రానున్నాయని ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కూటమి ప్రభుత్వానికి డిపాజిట్లు గల్లంతు ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. తల్లికి వందనం మొదలుకుని ఉచితగ్యాస్, మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం, 18 ఏళ్ల పైబడిన మహిళలకు నెలకు 1500, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక హామీలు ఇచ్చి మాట తప్పారన్నారు. జనసేన నాయకుడి రాసలీలలు బయటపడినా వాటిని ఖండించలేని స్థితిలో పవన్‌కళ్యాణ్ వున్నారని ఎద్దేవా చేశారు. కార్యకర్తలు అధైర్యపడొద్దని వారికి అండగా వుంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో మాజీమార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్‌విఆర్ మోహన్, నాయకులు యుగంధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఖలీల్, మండల అధ్యక్షులు రాము, కౌన్సిలర్లు లింగన్న, సుమో బాష, ముస్లిం మైనార్టీ నాయకులు నూర్‌నిజామి, ఫ్లయింగ్ మాబు, నాయకులు గోవింద్‌నాయక్, జయరాంరెడ్డి, యువజన విభాగం అధ్యక్షులు బషీర్, తదితరులు పాల్గొన్నారు.

**ప్రత్యేక ధన్యవాదాలు :** ఆరోగ్య రీత్యా గత నాలుగు నెలలుగా హైదరాబాద్‌లో చికిత్స తీసుకుని తిరిగి గుంతకల్లుకు వచ్చిన సందర్భంగా కార్యకర్తలు, నాయకులు తనపై చూపించిన ప్రేమాభిమానాలు వెలకట్టలేనివని మాజీ ఎమ్మెల్యే వైవిఆర్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో వారికి అన్ని విధాలా ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రధానంగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వైద్యులతో మాట్లాడి ఆపరేషన్ విజయవంతం అయ్యేలా చూసినందుకు ఆయనకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వైవిఆర్

# జిల్లాను హార్టీకల్చర్ హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం..

ఆకాశవాణి రైతు దినోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి




**అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 15, (ప్రభాతవార్త)**

కరవు ప్రాంతమైన అనంతపురం జిల్లాను హార్టికల్చర్ హబ్ గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం నగరంలో ఆకాశవాణి రైతు దినోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ తో పాటు జడ్పీ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా అధికారులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ముందుగా నగరంలోని తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుంచి ఎద్దుల బండ్లపై కలెక్టర్ తో పాటు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జడ్పీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్ ను ఆయన పరిశీలించారు. జడ్పీ సమావేశ మందిరంలో ఉత్తమ రైతులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఆకాశవాణి రైతులకు ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. నేను కూడా ఒక రైతు బిడ్డనేనని ఒక సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చి ఎమ్మెల్యేనయ్యానన్నారు. ఇప్పుడు ఆదర్శ రైతులకు సన్మానం చేయడం తన అదృష్టమన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన జిల్లా అధికారులకు, ఆకాశవాణి రేడియో వారికి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాకనే రైతులు సంక్షేమం చూస్తున్నారన్నారు. రైతులకు వ్యవసాయం లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ముఖ్యంగా అనంతపురం జిల్లా రైతాంగం అంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకమైన అభిమానం అన్నారు. జిల్లాలో పండ్లతోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఇందు కోసం డ్రిప్, స్ప్రింక్లర్ల విధానాన్ని గతంలో చంద్రబాబు తీసుకొచ్చారని ఇది ఇప్పుడు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గత ప్రభుత్వంలో డ్రిప్పు, స్ప్రింక్లర్లు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. 2014 నుంచి 19 మధ్యకాలంలో పెద్ద ఎత్తున మార్కెట్ యార్డులు నిర్మించామని, అలాగే డ్రిప్పు, స్ప్రింక్లర్లు కూడా అడిగిన ప్రతి రైతుకు అందించమన్నారు. వైసిపి హయాంలో దీనిని పూర్తిగా పట్టించుకోలేదన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన తర్వాత డ్రిప్పు, స్ప్రింక్లర్లు పెద్ద ఎత్తున అందిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారం, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పి ఎల్ ఎన్ మూర్తి, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, తెలుగుదేశం పార్టీ నాయకులు నెట్టెం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వంలో అదానితో చేసుకున్న భూ కేటాయింపులు రద్దు చేసుకోండి

**మొదటిపేజి తరువాయి...** చంద్రబాబు నాయుడును డిమాండు చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలకు సాగునీరు, తాగునీరు అందించే హంద్రీనీవా కాలువల విస్తరణ చేపట్టాలని తర్వాత లైనింగ్ పనులు చేయాలని సూచించారు. అనంతపురం జిల్లాలో ప్రజలపై భూ కబ్జాదారులు దాడులు చేస్తుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని మండిపడ్డారు. పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేస్తే కోర్టును ఆశ్రయించాలని ఉచిత సలహాలు ఇవ్వడం ఎంతవరకు భావ్యమని పోలీస్ యంత్రాంగాన్ని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో సిపిఐ అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాల కార్యదర్శులు సి. జాఫర్, ఎం. వేమయ్య యాదవ్, అనంతపురం జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున, అనంతపురం సిపిఐ నగర కార్యదర్శి ఎన్. శ్రీరాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి. లింగమయ్య, సిపిఐ జిల్లా సీనియర్ నాయకులు పెద్దవడుగూరు సూర్యనారాయణ రెడ్డి, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్ కుమార్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగాలు కల్పించడమే మా కూటమి ప్రభుత్వం లక్ష్యం ..!

**మొదటిపేజి తరువాయి...** ప్రారంభిస్తున్నారు 3 ,000 మంది మహిళ అక్క చెల్లెమ్మలకు 1,500 మంది పురుషులకు ఉద్యోగ అవకాశాలు కల్పించబోతున్నామన్నారు, నిరుద్యోగ యువతి ,యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో భాగంగా ప్రతి సంవత్సరం జాబ్ మేళాలను నిర్వహిస్తామని ఈరోజు జరిగినటువంటి జాబ్ మేళా కార్యక్రమంలో రెండువేల ఉద్యోగాలు అవకాశాలు కల్పించడమే లక్ష్యయంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు , గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడే మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో మూడుసార్లు జాబ్ మేళా కార్యక్రమాల నిర్వహించడం జరిగిందన్నారు , ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మళ్లీ మూడోసారి జాబ్ మేళాలో నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్ మేళా కార్యక్రమం ను నిర్వహించడం జరిగిందన్నారు , ప్రతి సంవత్సరం నియోజకవర్గంలో ఉన్నటువంటి నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రయత్నం చేస్తామన్నారు . రెండు నెలల క్రితం డిఎస్సీ కోచింగ్ సెంటర్ ను నిర్వహించి నిరుద్యోగ యువతీ . యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కూడా జరిగిందన్నారు . నియోజకవర్గంలో యువతి , యువకుల వలసలను అరికట్టే క్రమంలో భాగంగా ఇవన్నీ ఏర్పాటు చేస్తున్నామన్నారు , ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి , జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి రాధాకృష్ణ , జిల్లా మైనార్టీ అధ్యక్షుడు భక్తర్, మండల కన్వీనర్ లు లక్ష్మీనారాయణ , కుమారస్వామి . అగలి జడ్పీటిసి ఉమేష్ ఖి కౌన్సిలర్లు ఉమాశంకర్ ఖి బలరాం . మేఘన రమేష్ . శ్రీనివాసులు . తెలుగు యువత నాయకుడు తిమ్మరాజు , కళ్ళుమరి సర్పంచ్ నాగరాజు , మాజీ సర్పంచ్ జైపాల్ , జిల్లా కురుబ అధ్యక్షుడు గోవిందప్ప , మాజీ జెడ్పీటిసి నరసింహమూర్తి , రవీంద్రారెడ్డి . బిజెపి నాయకుడు చంద్రశేఖర్ ఖిజనసేన పార్టీ నాయకులు . 60 కంపెనీల ప్రతినిధులు .నాయకులు కార్యకర్తలు యువతీ ,యువకులు తదితరులు పాల్గొన్నారు ,

# ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలి హత్య కేసు ఛేదింపు -జిల్లా ఎస్పి జగదీష్

**అనంతపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

అనంతపురం నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో ఒంటరిగా నివసిస్తున్న పొమ్మల సావిత్రి (63) అనే వృద్ధురాలి హత్య కేసును ఛేదించినట్లు జిల్లా ఎస్పి జగదీష్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పి వివరాలు వెల్లడించారు. పొమ్మల సావిత్రి భర్త అటవీశాఖలో విధులు నిర్వహిస్తూ ఇటీవల కాలంలో మృతి చెందారు. వారికి ఇద్దరు కుమారులు, కుమార్తె వున్నారు. వారికి వివాహాలు కావడంతో వారు వేర్వేరుగా వుంటున్నారు. పొమ్మల సావిత్రి మాత్రం భర్త పెన్షన్‌తో జీవితం గడుపుతోందన్నారు. గత నెల 6వతేదీన ఇంటిలో వున్న పొమ్మల సావిత్రి హత్యకు గురైందన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆమె గొంతు కోసి హత్య చేశారన్నారు. ఆమె మెడలో వున్న రెండు బంగారు చైన్లు, సెల్‌ఫోను కనిపించలేదని అయితే ఆమె ఒంటిపై వున్న బంగారు గాజులు, చెవి కమ్మలు, ఉంగరాలు, వెండి కాళ్ల పట్టీలు ఇంటిలోని వస్తువులు యదావిధగా వున్నాయని ఆమె కొడుకు విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు అనంతపురం నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్ సిఐ కనుమూరి సాయినాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారన్నారు. కేసు ఛేదింపులో భాగంగా క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. ఆమె బంధువులతో పాటు ఇరుగుపొరుగు వారిని పోలీసులు విచారించారన్నారు. ఈ హత్య కేసు ఛేదింపు కోసం 3 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతో పాటు సిసి కెమెరా పుటేజిలు పరిశీలించారు. హత్య కేసు నిందితుడు షేక్‌అన్సర్ వెల్డింగ్ పనులు చేస్తూ జీవించేవాడని ఇతనికి తాగుడు, వ్యభిచారం తదితర చెడు వ్యవసనాలు వుండడంతో వెల్డింగ్ పనులు మానేసి వ్యసనాలు తీర్చుకునేందుకు అప్పులు చేశాడని అప్పు ఇచ్చిన వరి నుండి వత్తిడి పెరిగింది. చెడు వ్యసనాలు తీర్చుకునేందుకు తగిన సంపాదన లేదు. ఎలాగైనా డబ్బు సులువుగా సంపాదించాలని భావించిన షేక్‌అన్సర్ ఒంటరిగా వున్న వృద్ధులను టార్గెట్ చేసి వారి నుండి విలువైన ఆభరణాలు, నగదు కాజేయాలన్న పతకం పన్నాడు. నగరంలో ఈ తరహా వృద్ధుల కోసం రెక్కీ నిర్వహించాడని ఈ క్రమంలో టీచర్స్‌కాలనీలో వున్న పొమ్మల సావిత్రి ఇంటికి గత 6న వెళ్లాడని ఆ ఇంటికి టులెట్ బోర్డు వుందని తనకు ఆ ఇంటిని బాడుగకు ఇవ్వాలని కోరుతూనే తాగేందుకు నీళ్లు అడిగాడు. ఆమె తాగే నీళ్లు ఇచ్చే పనిలో నిమగ్నమై వుండగా అదే అదునుగా భావించి తన వెంట తెచ్చుకున్న స్టిక్కర్ బ్లేడ్‌తో గొంతు కోసి హత్య చేశాడు. ఆమె మెడలో ధరించిన బంగారు చైను, పగడాల బంగారు చైనుతో పాటు సెల్‌ఫోన్‌ను తీసుకుని నిందితుడు పరారైనట్లు విచారణలో తేలిందన్నారు. నిందితుని సమాచారం అందిన నేపథ్యంలో అనంతపురం అర్బన్ డిఎస్పి వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో అనంతపురం 4వ పట్టణ సిఐ కనుమూరి సాయినాథ్, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ జయపాల్‌రెడ్డి, ఎస్‌ఐలు రాంప్రసాద్‌రెడ్డిల ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి స్థానిక చెరువుకట్ట వద్ద నిందితున్ని అరెస్ట్ చేసి అతని వద్ద నుండి బంగారు ఆభరణాలు, కొంత మేరకు నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని అరెస్ట్ చేయడం పట్ల వారికి జిల్లా ఎస్పి అభినందనలు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పి